




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 202, పేజీలు - 08

ఆదివారం, జనవరి 4, 2026 వెల: 5 రూ/.








హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD


### మోదీపై కూనంనేని
## వ్యాఖ్యలు

**- తీవ్రంగా స్పందించిన కిషన్ రెడ్డి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రధానిపై ఆయన చేసిన వ్యాఖ్యలు హేయమైనవని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు శ్రమిస్తూ, అంతర్జాతీయస్థాయిలో

2లో..

### కృష్ణా జలాల్లో తెలంగాణకు
# అన్యాయం చేసిందే కేసీఆర్

**- 90 టీఎంసీలు తీసుకుని తీరుతామన్న సీఎం రేవంత్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసనసభలో కృష్ణా జలాల కేటాయింపులు, సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం సుదీర్ఘమై ప్రసంగం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టుల రూపకల్పన నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలను లెక్కలతో వివరించారు. ఈ సభకు ఉన్న పవిత్రతను గుర్తు చేస్తూ, ఇక్కడ మాటల గారడీలకు తావులేదని, ప్రతి మాట ప్రజల ఆశయాలకు ప్రతిరూపంగా ఉండాలని పేర్కొన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రాకుండా పారిపోవడం చట్టసభలను అవమానించడమేనని ముఖ్యమంత్రి మండిపడ్డారు.

**-ప్రాజెక్టుల రీ-డిజైనింగ్ వెనుక కుట్ర**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పునాదుల గురించి ప్రస్తావిస్తూ, 2009లోనే ఎంపీ విఠల్ రావు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి లేఖ రాసి ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారని గుర్తు చేశారు. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టులో

2లో..

### మహారాష్ట్ర
## మున్సిపల్ ఎన్నికలు

**- పోలింగ్‌కు ముందే 68 స్థానాల్లో 'మహాయుతి' ఏకగ్రీవం**



ముంబై (ప్రశ్న న్యూస్) మహారాష్ట్రలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో అధికార 'మహాయుతి' కూటమి సంచలనం సృష్టించింది. 15న పోలింగ్ జరగాల్సి ఉండగా, నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ఏకంగా 68 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 44 స్థానాలను కైవసం చేసుకోగా, ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 22 స్థానాలు, అజిత్ పవార్‌కు చెందిన

2లో..

### సూర్యాపేట జిల్లాలో
## 'జనంబాట'

**- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కవిత విమర్శలు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. 'జనంబాట'లో భాగంగా ఆమె సూర్యాపేట జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

2లో..

# అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

**- రాష్ట్రానికి ఇది ఘనమైన ఆరంభమన్న సీఎం**

- పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఏపీకి అగ్రస్థానం
- బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికలో వెల్లడైన గణాంకాలు
- దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి



అమరావతి (ప్రశ్న న్యూస్) పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 2026 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలానికి (ఏప్రిల్-డిసెంబర్ 2025) దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో ఏపీ ఏకంగా 25.3 శాతం వాటాను దక్కించుకుంది. ఈ విషయాన్ని బ్యాంక్ ఆఫ్ బరోడా తన తాజా ఆర్థిక నివేదికలో వెల్లడించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) డేటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఈ మేరకు ఫోర్బ్స్ బిజినెస్ మేగజైన్ ఓ కథనం వెలువరించింది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు శుభవార్త అని, కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వ ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. "ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త, కొత్త సంవత్సరానికి ఘనమైన ఆరంభం. మా ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల ప్రభావాన్ని, ప్రత్యేకించి, సకాలంలో

2లో..

## ఇల్లులేని నిరుపేదలకు శుభవార్త

**- మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఏ గ్రామానికి వెళ్లినా పేదవాడి ఇళ్లు ఆత్మగౌరవ చిహ్నంగా అడుగుతున్నమాట వాస్తవమంటూ అసెంబ్లీలో ప్రస్తావించారు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అసెంబ్లీ స్పీకర్, సీఎం రేవంత్ రెడ్డి తోపాటు ఆ శాఖా మంత్రిగా ఉన్న నా నియోజకవర్గంలో సైతం సొంత ఇంటి కల సాకారం కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్న మాట వాస్తమన్నారు. ఈ ప్రభుత్వం మూడు విడతలుగా అర్హులైన పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ నెల నుండి ఈ కార్యక్రమం మొదలవుతుందని, ఇలా ప్రతీ ఏడాది ఏప్రియల్ నెలలో సొంత ఇంటి కల సాకారం చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలా ఎన్నికల్లో ఇంటి ప్రశక్తి చెప్పకుండా, కేవలం బొమ్మల వరకూ సొంత ఇంటి కలలను పరిమితం చేయకుండా , ఇచ్చిన హామీ అమలు చేస్తామంటూ

2లో..

### కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు,
# సూచనలు ఇస్తారనుకున్నా

- చట్టసభలంటే ఆయనకు చిన్నచూపు
- కృష్ణా జలాల చర్చలో రేవంత్ రెడ్డి నిప్పులు
- రెండేళ్లుగా కేసీఆర్ సభకు రాకపోవడం విచారకరమని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కృష్ణా నదీ ప్రాజెక్టుల నిర్వహణ, నీటి కేటాయింపులపై తెలంగాణ శాసనసభలో ఇవాళ 'నీళ్లు-నిజాలు' అనే అంశంపై ఆసక్తికర చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు (పాలమూరు) తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు, పేదరికాన్ని తాను స్వయంగా

2లో..

### వెనుజులా అధ్యక్షుడు
## మదురోను బంధించాం

**- ట్రంప్ సంచలన ప్రకటన**



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురో , ఆయన భార్యను పట్టుకుని, ఆ దేశం నుంచి వెళ్లగొట్టినట్టు అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజధాని కారకాస్‌పై వైమానిక దాడులు చేసినట్టు ట్రంప్ ధ్రువీకరించారు. డ్రగ్స్ కార్యకలాపాలకు వెనుజులా కేంద్రంగా మారిందని ఆయన ఆరోపించారు. కారకస్‌లో శనివారం తెల్లవారుజామున భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్టు అంతర్జాతీయ మీడియా నివేదించింది. ఈ పేలుళ్లలో పలు భవనాలు మంటల్లో చిక్కుకున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ దాడులతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దక్షిణ కారకస్‌లోని ఆ దేశ అతిపెద్ద సైనిక స్థావరం కూడా అంధకారంలో చిక్కుకుంది. పేలుళ్లు జరిగిన కొద్ది సేపటికే మదురోను అదుపులోకి తీసుకున్నట్టు ట్రంప్ ప్రకటన చేశారు. మిరండా, అరగ్వా, లా గుయోరా రాష్ట్రాల్లో దాడులు జరిగినట్టు ప్రభుత్వం తెలిపింది. ఇక, అమెరికా సైన్యం దుందుడుకు చర్యలను ఖండించిన వెనుజులా జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. 'వెనిజులా భూభాగం, ప్రజలపై ప్రస్తుత అమెరికా ప్రభుత్వం చేసిన అత్యంత తీవ్రమైన సైనిక దురాక్రమణను

2లో..

## ప్రపంచానికి కొత్త ముప్పు

**- వేగంగా విస్తరిస్తున్న మెదడును తినే అమీబా**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి 'బ్రెయిన్ ఈటింగ్ అమీబా' (మెదడును తినే అమీబా) ముప్పు అంతకంతకూ పెరుగుతోందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. వాతావరణ మార్పులు, పాతబడిన నీటి సరఫరా వ్యవస్థలు, పర్యవేక్షణలో లోపాల కారణంగా ఈ ప్రమాదకర సూక్ష్మజీవులు నీటిలో, పర్యావరణంలో

2లో..

# పార్టీ పెట్టడానికి తెలంగాణే స్ఫూర్తి

**- కొండగట్టులో పవన్ కళ్యాణ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ గడ్డపై దశాబ్ద కాలం తర్వాత జనసేన పార్టీ సాధించిన తొలి విజయం చారిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం, ఇటీవల తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులుగా, వార్డు సభ్యులుగా విజయం సాధించిన అభ్యర్థులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను పేరుపేరునా అభినందిస్తూ, తెలంగాణ రాజకీయాల్లో ఇదొక సరికొత్త మార్పుకు నాంది కావాలని ఆయన ఆకాంక్షించారు.

**- తెలంగాణలో పుట్టిన జనసేన పార్టీ**

సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తాను పార్టీ పెట్టడానికి నాలో చైతన్యం నింపింది, నాకు ధైర్యం ఇచ్చింది తెలంగాణ నేలే అని భావోద్వేగంగా పేర్కొన్నారు. రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ బిడ్డలు చేసిన పోరాటం, అమరవీరుల త్యాగాల నుంచి తాను రాజకీయ శక్తిని పొందానని చెప్పారు. రాజకీయాల్లో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని నిలబడటానికి ఇక్కడి పోరాట స్ఫూర్తే కారణమని, తెలంగాణలో పుట్టిన జనసేన పార్టీ ఇక్కడి ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**- సిద్ధాంత బలం ఉన్న నాయకులను ఎవరూ ఏమీ చేయలేరు**

2లో..

## మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

**- లొంగిపోయిన అగ్రనేత బర్సే దేవా**

**- ఆయుధాలు, డబ్బు సహా 20 మందితో సరెండర్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) చీఫ్, మోస్ట్ వాంటెడ్ నేత బర్సే సుక్కా అలియాస్ దేవా శనివారం తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవాతో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి, ఆయన భార్య అడ్లూరి ఈశ్వరి సహా మొత్తం 20 మంది సభ్యులు ఆయుధాలను విడిచి జనజీవన స్రవంతిలో చేరారు. ఈ భారీ లొంగుబాటు పీఎల్‌జీఏ పతనానికి నాంది అని పోలీసులు భావిస్తున్నారు. లొంగిపోయిన మావోయిస్టులు తమతో పాటు భారీగా అత్యాధునిక ఆయుధాలను

2లో..

# మోదీపై కూనంనేని వ్యాఖ్యలు

భారతదేశ గౌరవాన్ని పెంచుతున్న నాయకుడు మోదీ అని కొనియాడారు. అలాంటి ప్రధానిపై కూనంనేని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దివాలాకోరుతనాన్ని బయటపెట్టాయని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కూనంనేని వంటి వారు చేస్తున్న వ్యాఖ్యలతో ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కిషన్ రెడ్డి సభాపతిని కోరారు. కాగా, కూనంనేని సాంబశివరావు శాసనసభలో మాట్లాడుతూ, మోదీ మైండ్‌ను టెస్ట్ చేయించాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసిందే కేసీఆర్

ఏ విధంగానైతే తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చి అంచనాలు పెంచారో, అదే విధంగా పాలమూరు-రంగారెడ్డిని కూడా జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి రూ.32,800 కోట్ల ప్రాజెక్టును రూ.90 వేల కోట్లకు చేర్చారని విమర్శించారు. వలసల జిల్లా పాలమూరు బిడ్డగా కరువు కష్టాలు తెలిసిన వాడిని కాబట్టే, ఈ అక్రమాలపై గొంతు ఎత్తుతున్నానని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

**- కృష్ణా జలాల్లో తెలంగాణకు ద్రోహం**

నీటి కేటాయింపుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు 'మరణ శాసనం' రాసిందని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు. బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడిటీ -1) ప్రకారం ఉమ్మడి ఏపీకి దక్కిన 811 టీఎంసీలలో తెలంగాణకు 490 టీఎంసీల వాటా అడగాల్సింది పోయి, కేసీఆర్ ప్రభుత్వం కేవలం 299 టీఎంసీలకే ఒప్పుకుని సంతకం పెట్టిందని సాక్ష్యాలను బయటపెట్టారు. 2015 జూన్ సమావేశంలో మొదలుకుని, 2016 , 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో కూడా ఇదే 299 టీఎంసీల తాత్కాలిక వాటాను శాశ్వతం చేసేలా కేసీఆర్ అంగీకరించి వచ్చారని ధ్వజమెత్తారు.

**- అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులు**

కాంగ్రెస్ హయాంలోనే 2005-2014 మధ్యకాలంలో కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఎస్ఎల్బీసీ వంటి కీలక ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఈ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సింది పోయి, రీ-డిజైనింగ్ పేరుతో కాలయాపన చేస్తూ అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. తెలంగాణకు సాగునీటి విషయంలో కేసీఆర్ చేసినంత అన్యాయం మరెవ్వరూ చేయలేదని ఆయన మండిపడ్డారు.

**- సవాల్ విసిరిన సీఎం**

సభ పెడితే బట్టలు ఊడదీస్తాం తోలు తీస్తాం అని గతంలో కేసీఆర్, హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తూ ఇప్పుడు సభ పెట్టాం, చర్చకు రమ్మంటే ఎందుకు పారిపోతున్నారని నిలదీశారు. మీరు చర్చలో పాల్గొని ఉంటే ఎవరి తోలు ఊడుతుందో, ఎవరి అబద్ధాలు బయటపడతాయో ప్రజలకే తెలిసేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ 4 కోట్ల ప్రజల ప్రాతినిధ్యం వహించే ఈ సభలో రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని, కృష్ణా , గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడి తీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలు

ఎన్సీపీ 2 స్థానాలను గెలుచుకుంది. థానే జిల్లాలోని కళ్యాణ్-డోంబివిలి కార్పొరేషన్‌లో అత్యధికంగా 22 స్థానాలు ఏకగ్రీవం కావడం గమనార్హం. ఈ విజయాలపై కేంద్ర మంత్రి మురళీధర్ మోహోల్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా పూణెలో బీజేపీకి చెందిన మంజుషా నాగ్‌పురే, శ్రీకాంత్ జగతాప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, వచ్చే మేయర్ పీఠం బీజేపీదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో సాధించిన విజయం, ప్రస్తుత వ్యూహకర్తల కృషి వల్లే ఈ ముందస్తు ఆధిక్యం సాధ్యమైందని బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. మరోవైపు, ఈ ఏకగ్రీవ విజయాలపై ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈడీ, సీబీఐ వంటి సంస్థల పేర్లతో భయపెట్టి లేదా ప్రలోభాలకు గురిచేసి తమ అభ్యర్థులతో నామినేషన్లు ఉపసంహరింపజేశారని శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంకా చతుర్వేది విమర్శించారు. ఈ పరిణామాలపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం, ఏకగ్రీవమైన స్థానాల్లో అభ్యర్థులపై ఏదైనా ఒత్తిడి లేదా బెదిరింపులు జరిగాయా అనే అంశంపై విచారణకు ఆదేశించింది. ముంబై (బీఎంసీ) సహా రాష్ట్రవ్యాప్తంగా 29 కార్పొరేషన్లకు జనవరి 15న ఎన్నికలు జరగనుండగా, 16న ఫలితాలు వెలువడనున్నాయి.

# సూర్యాపేట జిల్లాలో 'జనంబాట'

తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆమె ఆరోపించారు. తన పర్యటనలో భాగంగా ఆమె వివిధ వర్గాల ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడకక్కడే నిలిచిపోయాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధిలో తాను ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై దృష్టి సారించానని ఆమె అన్నారు. అర్వపల్లి మండలంలోని కేజీబీవీ స్కూల్‌ను పరిశీలించినట్లు తెలిపారు. గత ఏడాది తుపాను వచ్చి పాఠశాల మునిగిపోతే కలెక్టర్ వచ్చి పరిశీలించారని, కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

# అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

మరియు పారదర్శకంగా ప్రోత్సాహకాల పంపిణీ కోసం ఎస్క్రో-ఆధారిత యంత్రాంగాన్ని ప్రవేశపెట్టడం, అలాగే స్పష్టమైన, రంగాల వారీ విధానాలను ప్రవేశపెట్టడం వంటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కార్యక్రమాల ప్రభావాన్ని ఇది ప్రతిబింబిస్తుంది" అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంపై నమ్మకముంచి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన ఇన్వెస్టర్లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ప్రకారం, ఈ తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా మొత్తం రూ.26.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ తర్వాత ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ మూడు రాష్ట్రాలు కలిపి దేశంలోని మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో 51.2 శాతం వాటాను ఆకర్షించడం గమనార్హం.

# పార్టీ పెట్టడానికి తెలంగాణే స్ఫూర్తి

తెలంగాణకు ప్రస్తుతం బలమైన, నిజాయితీ కలిగిన యువ నాయకత్వం అవసరమని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ప్రతినిధులుగా మీరు వేసిన ఈ చిన్న అడుగు, భవిష్యత్తులో మహా ప్రస్థానానికి దారి తీస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్ధాంత బలం ఉన్న నాయకులను ఎవరూ ఏమీ చేయలేరని, పదవుల కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే తపనతో ఎదగాలని పిలుపునిచ్చారు. పోటీ చేసిన స్థానాల్లో 50 శాతం విజయం సాధించడం సామాన్యమైన విషయం కాదని, ఇది పార్టీ శ్రేణుల కష్టానికి నిదర్శనమని కొనియాడారు.

**- తెలుగు ప్రజలందరూ ఐక్యంగా ఉండాలి**

రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలు భిన్నంగా ఉన్నప్పటికీ, తెలుగు ప్రజలందరూ ఐక్యంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాలు క్షేమంగా ఉండాలి.. ప్రజల మధ్య ఐక్యత కోసం మనమంతా కలిసి పనిచేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి అభివృద్ధిని ప్రారంభించి, జనసేన మార్క్ పాలనను ప్రజలకు చూపించాలని ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. గెలిచిన అభ్యర్థులు పవన్ కల్యాణ్ మాటలతో కొత్త ఉత్సాహం వచ్చినట్లయింది.

# ఇల్లులేని నిరుపేదలకు శుభవార్త

అసెంబ్లీలో తెలిపారు పొంగులేటి. ఈ అసెంబ్లీ సమావేశాల తరువాత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీపై కసరత్తు చేయబోతున్నట్లు తెలిపారు. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు డబ్బు కట్టినవారికి సైతం న్యాయం జరిగేలా చూస్తామన్నారు. గతంలో రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్దలాలు ఇచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. బిఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ,పేదలకు ఇచ్చిన ఇళ్ల స్దలాలను వ్యవసాయ భూములుగా రికార్డు మార్పిచారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో మోసం చేశాని తెలిపారు. అటువంటి స్దలాలను తిరిగి అర్హులైన నిరుపేదలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్దలాలకు అనుకూలమైన భూములు ఉంటే, వాటిని కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేదలకు ఇంటి కల అనేది ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం. ఇందిరమ్మ ఇంటి కలను సాకారం చేయడంలో, పేదలకు సంబంధించిన ఈ పథకాన్ని అమలు చేయడంలో తల తకాట్టుపెటైనా చెప్పింది చేసితీరుతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుకూలంగా ఇందిరమ్మ ఇళ్లు చెప్పే విషయంలో వెనక్కు తగ్గబోమని స్పష్టం చేశారు. మేము అధికారంలోకి వచ్చేనాటికి 133 ప్రాంతాల్లో 36వేల ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయి. గ్రామాల్లో, పట్టణాల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో 12,500 ఇళ్లు గిరిజన నియోజకవర్గాలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. చెంచులు ఉన్న చోట 12,896 ఇళ్లు మొదటి విడతలోనే ఇవ్వడం జరిగిందన్నారు.కేసీఆర్ దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామంలో కూడా ఇందిరమ్మ ఇళ్లు మేమే కట్టించామన్నారు. గత పదేళ్లలో ఏడాది లక్ష ఇళ్లు ఇచ్చినా, పది లక్షల ఇళ్లు కట్టేవారు. వాళ్లు శ్రద్ద చూపించని కారణంగా , ఏ గ్రామానికి వెళ్లినా పేదవాడికి ఇళ్లు లేని దుస్దితి నెలకొందన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

# కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు, సూచనలు ఇస్తారనుకున్నా

చూశానని ఈ జలాల విషయంలో ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. నదీ జలాల చర్చను స్వయంగా తెరపైకి తెచ్చిన ప్రతిపక్ష నేత కేసీఆర్ తీరా సభలో చర్చ జరుగుతుంటే గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ఎంతో అనుభవం ఉన్న మాజీ ముఖ్యమంత్రి సభకు వచ్చి సలహాలు, సూచనలు ఇస్తారని ఆశించాం. బహిరంగ సభల్లో, పార్టీ కార్యాలయాల్లో మాట్లాడే మాటల కంటే చట్టసభల్లో మాట్లాడే మాటలకే విలువ ఉంటుంది. కానీ కేసీఆర్ ప్రజల కంటే పార్టీకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది చట్టసభల పట్ల బీఆర్ఎస్‌కు ఉన్న చిన్నచూపును వెల్లడిస్తోంది' అని రేవంత్ రెడ్డి విమర్శించారు.గతంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జానారెడ్డి, భట్టి విక్రమార్క వంటి నేతలు ఎన్ని అవమానాలు ఎదురైనా సభకు వచ్చి ప్రజా సమస్యలను సమర్థవంతంగా వినిపించారని సీఎం గుర్తు చేశారు. బయట మాత్రం సభలు పెట్టండి, తోలు తీస్తాం అని సవాల్ చేసే ప్రతిపక్ష నేత, సభ పెడితే ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు ఎందుకు బాయ్‌కాట్ చేసి పారిపోతున్నారని నిలదీశారు. ఈసారి సభలో ఎవరూ అనుచిత వ్యాఖ్యలు కూడా చేయలేదని, కేసీఆర్ రాకపోవడానికి ఎలాంటి కారణాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

కృష్ణా ప్రాజెక్టుల విషయంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేసీఆర్‌ను నేరుగా ప్రశ్నించాలని అనుకున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. 24 ప్రాజెక్టులకు 490 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయని, ఇవన్నీ ఉమ్మడి రాష్ట్రంలో జరిగినవేనని అందరికీ తెలుసునని చెప్పారు.

అయితే అగ్రనేతగా ఉన్న కేసీఆర్ ఈ విషయంలో ఎందుకు అన్యాయం జరగనిచ్చారని ప్రశ్నించారు. ఆయనను ఎవరైనా తప్పుదోవ పట్టించారా లేక ఉద్దేశపూర్వకంగానే అలా చేశారా అనే విషయాలను కేసీఆర్‌ను అడిగి ప్రజల ముందు ఉంచాలనుకున్నామన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై అవసరమైతే నిజనిర్ధారణ కమిటీ వేయాలని రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత ఎవరి తోలు ఎవరు తీస్తారో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు.

**- తెలంగాణ ప్రయోజనాలే నా ఊపిరి: సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

తెలంగాణ రాష్ట్ర నీటి హక్కులు, అభివృద్ధి మరియు ప్రజల ఆశయాల పరిరక్షణ విషయంలో తన ప్రభుత్వం వెనకడుగు వేయబోదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి చుక్క నీటి కోసం, మన హక్కుల కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతాం అని ముఖ్యమంత్రి ప్రకటించారు. కృష్ణా, గోదావరి జలాల పంపిణీలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకుంటామని, ఇందులో రాజకీయాలకు తావులేకుండా ప్రభుత్వం ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్తుందని ఆయన హామీ ఇచ్చారు.

తెలంగాణ ప్రజలకు మేలు చేయడమే తన ఏకైక లక్ష్యమని, దేవుడిపై ఆనగా తాను ఉన్నంత కాలం తెలంగాణ హక్కులకు భంగం కలగనివ్వనని సభ సాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. అభివృద్ధిలో ఏకాభిప్రాయం రాష్ట్ర అభివృద్ధి విషయంలో పాలక, ప్రతిపక్షాలు కలిసి రావాలని, ప్రజల ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మాటల గారడీలకు కాకుండా, వాస్తవాలకు లోబడి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

# వెనుజులా అధ్యక్షుడు మదురోను బంధించాం

అంతర్జాతీయ సమాజం ముందు వెనుజులా తిరస్కరిస్తుంది, ఖండిస్తుంది' అని అధ్యక్షుడు మదురో ప్రభుత్వం తెలిపింది. గతంలోనే మదురోను వెనుజులా విడిచి వెళ్లాలని ట్రంప్ హెచ్చరించారు. కారకాస్‌లో జరిగిన అనేక దాడుల వెనుక అమెరికా సైన్యం ఉందని యూఎస్ మీడియా పేర్కొంది. దాడుల్లో అమెరికా సైన్యం పాత్ర ఉందని అధికార యంత్రాంగం నిర్ధారించినట్టు సీబీఎస్, ఫాక్స్ న్యూస్ నివేదించాయి. వెనుజులాలోని డ్రగ్ కార్టెల్స్‌పై భూతల దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొద్ది వారాల కిందట వార్నింగ్ ఇచ్చారు. అంతేకాదు, కరేబియన్ దేశం చుట్టూ అమెరికా అత్యాధునిక యుద్ధనౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్, ఇతర యుద్ధ నౌకలు సహా భారీగా నేవీ, వైమానిక దళాలను మోహరించారు. గత సెప్టెంబరు నుంచి కరేబియా, తూర్పు పసిఫిక్ సముద్రంలో డ్రగ్ స్మగ్లర్లే లక్ష్యంగా పలుదాడులు జరిగాయి.

ఈ దాడుల్లో 100 మందికిపైగా హతమవ్వగా.. వెనిజులాపై చమురు దిగ్బంధనంలో భాగంగా అమెరికా భద్రతా దళాలు సముద్రంలో రెండు ట్యాంకర్లను కూడా స్వాధీనం చేసుకున్నాయి. కాగా, డ్రగ్ కార్టెల్స్‌కు వెనుజులా అధ్యక్షుడు మదురో నాయకుడని ట్రంప్ ఆరోపిస్తున్నారు. మదురో పదవి నుంచి వైదొలగడం తెలివైన పని అని ఆయన ఇటీవల అన్నారు. వెనిజులా నాయకుడికి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. డ్రగ్స్ వ్యాపారంలో తన ప్రమేయం ఏమీ లేదని మదురో ఖండించారు. భూమిపైనే అత్యంత పెద్ద చమురు నిల్వలు వెనిజులాలో ఉన్నందున అమెరికా వాటిని దక్కించుకోడానికి తనను పదవి నుంచి తొలగించాలని చూస్తోందని అన్నారు.

# ప్రపంచానికి కొత్త ముప్పు

విస్తరిస్తున్నాయని పర్యావరణ, ప్రజారోగ్య శాస్త్రవేత్తల బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అధ్యయన వివరాలు 'బయోకంటామినెంట్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సాధారణంగా మట్టి, నీటిలో కనిపించే ఈ ఏకకణ జీవులను 'ఫ్రీ-లివింగ్ అమీబే' అని కూడా పిలుస్తారు. వీటిలో చాలా వరకు ప్రమాదకరం కానప్పటికీ, కొన్ని జాతులు ప్రాణాంతక ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. వీటిలో అత్యంత ప్రమాదకరమైనది 'నెగ్లెరియా ఫౌలెరి'. కలుషిత నీటిలో దిగడం, ఈత కొట్టడం వంటివి చేసినప్పుడు ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశించే ఈ అమీబా, మెదడుపై దాడి చేసి తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుంది. ఇది చాలా అరుదైనప్పటికీ, సోకిన వారిలో మరణాల రేటు దాదాపు 99 శాతం వరకు ఉంటుంది. ఇటీవలి సంవత్సరాలలో కేరళలో నమోదైన పలు మరణాలకు కూడా ఈ అమీబానే కారణమని అధ్యయనంలో గుర్తుచేశారు. ఈ అమీబాల గురించి చైనాలోని సన్ యట్ సేన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకుడు లాంగ్‌ఫీ షూ మాట్లాడుతూ "ఇతర సూక్ష్మజీవులు మనుగడ సాగించలేని పరిస్థితులను సైతం తట్టుకుని జీవించగలగడమే ఈ అమీబాలను మరింత ప్రమాదకరంగా మారుస్తోంది. ఇవి అధిక ఉష్ణోగ్రతలను, క్లోరిన్ వంటి శక్తివంతమైన క్రిమిసంహారకాలను కూడా తట్టుకోగలవు. సురక్షితం అనుకునే నీటి పంపిణీ వ్యవస్థలలో కూడా ఇవి జీవించగలవు" అని వివరించారు.

అంతేకాకుండా, ఈ అమీబాలు ఇతర హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లకు 'ట్రోజన్ హార్స్' (రహస్య వాహకాలు)గా పనిచేస్తాయని శాస్త్రవేత్తలు నొక్కిచెప్పారు. ఇతర సూక్ష్మజీవులను తమ కణాలలో దాచుకోవడం ద్వారా, నీటి శుద్ధి ప్రక్రియల నుంచి వాటిని కాపాడతాయి. దీనివల్ల తాగునీటి వ్యవస్థలలో ప్రమాదకర క్రిములు వ్యాప్తి చెందడానికి, యాంటీబయాటిక్ నిరోధకత పెరగడానికి కూడా ఆస్కారం ఏర్పడుతుంది. భూమి వేడెక్కడం వల్ల ఉష్ణోగ్రతను ఇష్టపడే ఈ అమీబాలు గతంలో లేని కొత్త ప్రాంతాలకు కూడా విస్తరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ ముప్పును ఎదుర్కోవడానికి మానవ ఆరోగ్యం, పర్యావరణ శాస్త్రం, నీటి నిర్వహణను అనుసంధానిస్తూ 'వన్ హెల్త్' విధానాన్ని అనుసరించాలని పరిశోధకులు పిలుపునిచ్చారు. ఇన్ఫెక్షన్లు రాకముందే ప్రమాదాన్ని తగ్గించడానికి బలమైన పర్యవేక్షణ, మెరుగైన నిర్ధారణ పద్ధతులు, అధునాతన నీటి శుద్ధి సాంకేతికతలను అవలంబించాలని సూచించారు. "ఇది కేవలం వైద్య లేదా పర్యావరణ సమస్య కాదు. ఈ రెండింటినీ కలిపి చూస్తూ, ప్రజారోగ్యాన్ని మూలం నుంచే కాపాడే సమగ్ర పరిష్కారాలు అవసరం" అని లాంగ్‌ఫీ షూ స్పష్టం చేశారు.

# మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. ఇందులో ఇజ్రాయెల్ తయారీ టవర్ వెపన్, యూఎస్ఏ తయారీ కోల్ట్ ఆయుధాలు ఉండటం గమనార్హం. వీటితో పాటు 8 ఏకే-47 తుపాకులు, 2 ఎల్ఎమ్‌జీలు, 8 ఎస్ఎల్ఆర్‌లు, 4 బ్యారెల్ గ్రానైడ్ లాంచర్లు, హెలికాప్టర్లను సైతం కూల్చే సామర్థ్యం ఉన్న ఆయుధ సామగ్రిని డీజీపీకి అప్పగించారు. అలాగే తమ వద్ద ఉన్న రూ. 20 లక్షల నగదును కూడా పోలీసులకు అప్పగించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువర్తి గ్రామానికి చెందిన దేవా ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు అగ్రనేత మాడ్వి హిడ్మాకు అత్యంత సన్నిహితుడు. హిడ్మా సొంత గ్రామానికి చెందిన వాడైన దేవాపై ఎన్ఐఏ రూ. 75 లక్షల రివార్డు ప్రకటించింది. పీఎల్‌జీఏ బెటాలియన్‌లో ఒకప్పుడు 400 మంది సభ్యులు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 66కు పడిపోయిందని దేవా లొంగుబాటుతో ఈ విభాగానికి వెన్నెముక విరిగినట్లయిందని డీజీపీ తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు, ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస ప్యాకేజీల పట్ల ఆకర్షితులై వీరంతా లొంగిపోయినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున రూ. 1.80 కోట్ల రివార్డు సొమ్మును అందజేయనున్నారు. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ. లక్ష నగదును డీజీపీ పంపిణీ చేశారు. రాజిరెడ్డి లొంగుబాటుతో తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఇప్పుడు కేవలం ఒక్కరు మాత్రమే మిగిలి ఉన్నారని.. మొత్తం మీద తెలంగాణ నుంచి పార్టీలో ఉన్న సభ్యుల సంఖ్య 17కు తగ్గిందని అధికారులు స్పష్టం చేశారు. అడవిలో అనాలోచిత పోరాటం మానుకొని, మిగిలిన సభ్యులు కూడా లొంగిపోయి సమాజ సేవలో భాగస్వాములు కావాలని డీజీపీ శివధర్ రెడ్డి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# సావిత్రిబాయి పూలే జీవితం నేటి మహిళలకు ఆదర్శం

**- అన్ని పాఠశాలల్లో పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి**

**- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లాధ్యక్షులు : బత్తుల మహేందర్ యాదవ్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో మహాత్మ జ్యోతిబా పూలే-సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు.వేములవాడ అర్బన్ మండలం చింతలఠాణ గ్రామంలోని ప్రీ-ప్రైమరీ స్కూల్‌లో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించి, విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు పంపిణీ చేశారు.అనంతరంమహేందర్ యాదవ్ మాట్లాడుతూవిద్య ద్వారానే మహిళా విముక్తి సాధ్యమని విశ్వసించి, బాలికల విద్యకు బాటలు వేసిన సావిత్రిబాయి పూలే జీవితం నేటి సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. అణగారిన వర్గాలు, మహిళల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వేములవాడ అర్బన్ మండల అధ్యక్షులు పార్వతి మహేష్ గౌడ్, చొక్కాల ప్రశాంత్, లింగంపల్లి రమేష్ గడ్డి, ప్రశాంత్ వల్లపు రాజు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# రైతన్నల గౌరవార్థం పాస్ పుస్తకాలపై రాజముద్ర

**- రుద్ర వరంఎమ్మెల్యే భూమా అఖిలమ్మ ఆదేశాల మేరకు పుస్తకాలు పంపిణీ**

**- టిడిపి జిల్లా సహాయ కార్యదర్శి ముల్లా రజాక్.**

**రుద్రవరం (చిలకలూరు) :** రైతన్నల గౌరవార్థం భూ యాజమాన్య హక్కు పత్రాలపై రాజముద్ర లిఖించినట్లు నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ సహాయ కార్యదర్శి ముల్లా రజాక్ పేర్కొన్నారు. రుద్రవరం మండల పరిధిలోని చిలకలూరు గ్రామంలో ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ గారి ఆదేశాల మేరకు నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలను రెవెన్యూ అధికారుల సమక్షంలో శనివారం పంపిణీ చేసినట్లు రజాక్ తెలిపారు.ఆరుగాలం కష్టపడి ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసే అన్నదాతకు రాజముద్రకు స్వతంత్ర భారతావని నుండి ప్రభుత్వ రాజ ముద్రతో భూ హక్కు యాజమాన్యం పత్రాలు ఉండడం గమనార్హం అని సూచించారు. భూమి ఎవరిదో వారి ఫోటోలు మాత్రమే పట్టాదార్ పాస్ పుస్తకాలలో ఉండాలన్న సదుద్దేశంతో తెలుగుదేశం పార్టీ నూతన పాస్ పుస్తకాలను మంజూరు చేసినట్లు తెలిపారు. యాజమాన్య హక్కులు కల్పించి రైతన్నలకు సముచిత స్థానం కల్పించడమే ఆంధ్రప్రదేశ్ లో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు మరియు ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిల ప్రియా గారి లక్ష్యమని ముల్ల రజాక్ స్పష్టం చేశారు. వన్ బి, అడంగల్ ఒంటి రెవెన్యూ రికార్డులు కావలసిన రైతన్నలు మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ముల్ల రజాక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖర్ వీఆర్వో హుస్సేన్ టిడిపి యువ నేతలు ఈ రాముడు, ఉపాధి హామీపథకం సి గోపాల్, ముల్లా అన్వర్, ముల్లా వన్నూరు సాహెబ్ శిరివెళ్ల హుస్సేన్ భాష, నరసింహా గౌడ్, ఇతర నాయకులు కార్యకర్తలు ప్రముఖులు అధికారులు పాల్గొన్నారు.

# ఆనాడే మహిళలు చదువుకోవాలని చెప్పినా సావిత్రిబాయి పూలే



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రి బాయి పూలే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన ప్రిన్సిపాల్: శ్రీనాథ్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీల అభ్యున్నతికొరకు స్త్రీలకు విద్యను ప్రోత్సాహించిన మొట్ట మొదటి మహిలా ఉపాధ్యాయురాలిగా అవతరించిన సంగ సంస్కర్త సావిత్రీబాయి పూలే జన్మదినం జనవరి మూడు న అంతర్జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారని మహిళలకు చదువు తప్పనిసరి అని మహిళలు ఈరోజుల్లో అన్నిరంగాలలో రాణించడానికి తోడ్పడిందనీ ఆమే ఒక ఆదర్శమూర్తి అని కొనియాడుతు ఆమెకు ఘనంగా నివాలులు అర్పించారు. ఈసందర్భంగా బీసీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మామిడి విట్టల్ మాట్లాడుతు అనగారిన వర్గాల ఆశాదీపం జ్యోతిరావు పూలే గారి సతీమణి మన సావిత్రీబాయి పూలే సమాజంలో మహిళలు విద్యావంతులు కావాలనీ కృతనిశ్చయంతో ఎన్నో అవమానాలు భరించి మహిళ అభ్యుదయానికి కృషిచేసిన మొట్ట మొదటి మహిలా ఉపాద్యయురాలు మన సవిత్రీబాయి పూలే సమస్త భారతావణి గర్వించే గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడుతూ నివాలులు అర్పించారు.ఈకార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్దులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన పాస్పోర్ట్

**తుగ్గలి:** తుగ్గలి మండల పరిధిలోని గల గుడిసె గుప్పి రాళ్ల గ్రామంలో గత మూడు రోజుల క్రితం తన పాస్పోర్ట్ ను పోగొట్టుకున్నట్లు బాధితుడు రమేష్ సన్నాఫ్ రాముడు శనివారం రోజున తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా తన పాస్పోర్ట్ దొరికితే 9494626316 నంబర్ కు సమాచారం అందించాలని ఆయన తెలియజేశారు. గత మూడు రోజుల నుండి పాస్పోర్టును వెతకగా ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదని,కావున ఎవరికైనా పాస్పోర్టు దొరికితే ఈ నెంబర్కు సంప్రదించి సమాచారం అందించాలని రమేష్ తెలియజేశారు.

## జనవరి 18న ఖమ్మం నగరంలో జరిగే సిపిఐ శత వసంతాల వేడుకలను జయప్రదం చేయండి

**- సిపిఐ ఏరియా కార్యదర్శి కామ్రేడ్ చక్రవరం సత్యనారాయణ రాజు పిలుపు**




**నరసరావుపేట,** నరసరావుపేట పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ ఏరియా కార్యదర్శి కామ్రేడ్స్ చక్రవరం సత్యనారాయణ రాజు మాట్లాడుతూ, జనవరి 18వ తేదీన ఖమ్మం నగరంలో ఖమ్మం నగరంలో సిపిఐ శత వసంతాల వేడుకలను ఘనంగా జరగనున్నాయని దానికి కార్యకర్తలందరూ నరసరావుపేట నియోజకవర్గ నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. 100 సంవత్సరాల ప్రస్తావనములో ఎన్నో పోరాటాలు, ఎన్నెన్నో త్యాగాలు చేసిందని, భూమి కోసం, భుక్తి కోసం, ప్రజల విముక్తి కోసం పోరాడిన పార్టీ సిపిఐ అని, సంపూర్ణ స్వతంత్రం కావాలని నినదించిన పార్టీ సిపిఐ ని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సిపిఐ మండల కార్యదర్శి కోయి శ్రీను, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్కే చిన్న జాను సైదా, సాయి, గోపి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ధూళిపాళ్ళ భరత్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో మహా అన్నదాన కార్యక్రమం



**పిడుగురాళ్ల,** పిడుగురాళ్ల లో అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరించిన భక్తుల కోసం శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం నందుమహా అన్నదాన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిడుగురాళ్ల పట్టణంలోని మమత హాస్పిటల్ అధినేత, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిడుగురాళ్ల బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ ధూళిపాళ్ళ భరత్ కుమార్, సునీత దంపతులు హాజరై, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ, మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించే అవకాశం రావడంనా జీవితంలో ఒక ఆధ్యాత్మిక సంతృప్తిని కలిగించింది అని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన దేవాలయ కమిటీ సభ్యులకు, దాతలకు, భక్తులకు, స్వచ్ఛంద సేవకులకు డాక్టర్ భరత్ కుమార్ దంపతులు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్ప స్వామి కృప అందరిపై ఉండాలని కోరుకుంటున్నామని డాక్టర్ భరత్ కుమార్ దంపతులు తెలిపారు.

## జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి** ప్రకాశం జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఒంగోలులో నిర్వహించారు. ఈ సమావేశంలో కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ ఇంచార్జ్, హనుమంతునిపాడు మండల జడ్పీటీసీ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్తో పాటు కనిగిరి నియోజకవర్గానికి చెందిన జడ్పీటీసీలు గుంటక తిరుపతి రెడ్డి, మడతల కస్తూరి రెడ్డి, మేకల శ్రీనివాసులు, లక్ష్మీకాంతం ఓకే రెడ్డి తదితరులు హాజరయ్యారు. జిల్లా అభివృద్ధి, స్థానిక సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరగగా, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పని చేయాలని పలువురు సభ్యులు సూచించారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించిన కార్యనిర్వహణాధికారి

**శ్రీశైలం** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 08వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగనున్నాయి. మహాశివరాత్రి పర్వదినం ఫిబ్రవరి 15తేదీన రానున్నది. 11 రోజులపాటు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించేందుకు ఈరోజు (03.01.2026) కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, దేవస్థానం యూనిట్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి మరియు జిల్లా యంత్రాంగ సహాయ సహకారాలతో, ధర్మకర్తల మండలి సహకారంతో మహాశివరాత్రి ఏర్పాట్లన్నీ కూడా పకడ్బందీగా చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల వారీగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను కూలంకుషంగా చర్చించారు. ఆయా విభాగాధిపతులకు, పర్యవేక్షకులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అన్ని విభాగాలు కూడా ఇప్పటికే రూపొందింపజేసుకున్న ప్రణాళికను అనుసరించి ఏర్పాట్లన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 8న ప్రారంభమవుతున్నప్పటికీ భక్తులు ముందస్తుగానే క్షేత్రానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. అందుకే శివరాత్రి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా పనులు పూర్తి నాణ్యతతో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా అన్ని విభాగాలు కూడా సమిష్టిగా పరస్పర సమన్వయంతో ఉత్సవ నిర్వహణలో విధులు నిర్వహించాలన్నారు. గత సంవత్సరం కంటే కూడా ఈ సంవత్సరం భక్తులరద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. అందుకే అన్నీ ఏర్పాట్లు కూడా గత సంవత్సరం కంటే కూడా అధికస్థాయిలో చేయాలన్నారు. ముఖ్యంగా గత సంవత్సరం కంటే కూడా ప్రతీచోట కూడా అవకాశం మేరకు 20 నుండి30 శాతం దాకా అదనపు ఏర్పాట్లు ఉండాలన్నారు. పాదయాత్రతో వచ్చే భక్తుల సౌకర్యార్థం నాగలూటి, పెద్దచెరువు, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షిగణపతి మొదలైనచోట్ల చేయాల్సిన ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అటవీశాఖ వారి సహకారంతో నడకదారిలో వచ్చే భక్తులకు ఆయా ఏర్పాట్లను కల్పించాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. మహాశివరాత్రికి వచ్చే భక్తులు సేద తీరేందుకు ఆరుబయలు ప్రదేశాలలో విశాలమైన ప్రాంగణం ఉండేటట్లుగా పైప్పెండాల్స్, షామియానాలు మొదలైనవాటిని వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలన్నారు. వీటివద్ద తగినంత విద్యుద్దీపాల ఏర్పాట్లు ఉండాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. క్యూలైన్లన్నీ దృఢంగా ఉండేవిధంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ప్రజాసౌకర్యాలకు ( మూత్రశాలలు మరియు మరుగుదొడ్లు) అవసరమైన అన్ని మరమ్మతులు చేయించి వినియోగంలోకి వచ్చేవిధంగా తగు ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ మరియు పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో మంచినీటిసరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. రోజువారి నీటిసరఫరా సామర్థ్యాన్ని, బ్రహ్మోత్సవాలలో క్షేత్రానికి వచ్చే భక్తులరద్దీని బేరీజు వేసుకుంటూ తగు ముందస్తు జాగ్రత్తలో నీటిసరఫరా ఏర్పాట్లు ఉండాలన్నారు. క్షేత్రపరిధిలో అవసరమైనచోట్ల అదనపు కుళాయిలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పట్ల తగు ముందస్తు ఏర్పాట్లు ఉండాలన్నారు. గతంలో వలనే క్షేత్రపరిధిని జోన్లుగా, సెక్టార్లుగా విభజించి, ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించే విధంగా పారిశుద్ధ్య ఏర్పాట్లు ఉండాలన్నారు. పార్కింగు ఏర్పాట్లు, సామాన్లు భద్రపరుచుగది, ట్రాఫిక్ నియంత్రణ మొదలైన అంశాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, భద్రతా విభాగం ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. గత సంవత్సరం కంటే కూడా సారి అదనపు ప్రదేశాలలో పార్కింగ్ ఏర్పాట్లు ఉండాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల వివరాలు స్పష్టంగా తెలిసేవిధంగా సూచికబోర్డులు అధికసంఖ్యలో ఉండాలన్నారు. అదేవిధంగా పాతాళగంగలో కూడా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. ముఖ్యంగా పాతాళగంగలో సేఫ్టీమెష్ (రక్షణ



కంచె), పాతాళగంగలో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు అవసరమైన గదుల ఏర్పాట్లు, పాతాళగంగమెట్లమార్గంలో అవసరమైన మరమ్మతులు మొదలైనవాటిపట్ల శ్రద్ధ కనబర్చాలన్నారు. భక్తులరద్దీకనుగుణంగా అన్నప్రసాదవితరణ ఏర్పాట్లు ఉండాలన్నారు. క్షేత్రపరిధిలో అన్నదానం చేసే స్వచ్ఛందసేవాసంస్థలకు దేవస్థానం పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. గత సంవత్సరం లడ్డు ప్రసాదాల వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సారి తగినన్నీ లడ్డు ప్రసాదాలను సిద్ధం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం వున్న కౌంటర్లకు అదనంగా మరో 20 లడ్డుకౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. మొత్తం 30 లడ్డు ప్రసాదాలకౌంటర్లు అందుబాటులో ఉంచాలన్నారు.

## 50 మంది ఎమ్మెల్యేలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్...

**ఏపీ లో నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కదలిక వచ్చింది...**

2026 నాటికి నియోజకవర్గాల పునర్విభజన ఖాయమని తేలింది...వాస్తవానికి 2014 రాష్ట్ర విభజన తోనే నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. ఇప్పుడు ఉన్న సంఖ్య పెరగాలి. కానీ అలా జరగలేదు. దానికి రకరకాల కారణాలు ఉన్నాయి...ముఖ్యంగా జన గణనతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం తరువాతనే పునర్విభజన అని సంకేతాలు వచ్చాయి...అయితే జన గణనతో పాటు మహిళా బిల్లు ఆమోదం పొందనుండడంతో 2026 లో నియోజకవర్గాల పునర్విభజన అని స్పష్టమౌతోంది...అదే జరిగితే ఏపీలో అదనంగా మరో 50 నియోజకవర్గాలు ఏర్పాటు కానున్నాయి...దీంతో అసెంబ్లీ స్థానాల సంఖ్య 225 కు పెరగనున్నాయి. అదే జరిగితే రాజకీయ ఆశావహులకు కొంతవరకు అవకాశాలు మెరుగు పడినట్టే...విభజన చట్టంలో...2014 లో రాష్ట్ర విభజన జరిగింది. 175 అసెంబ్లీ స్థానాలతో పాటు 25 పార్లమెంటు స్థానాలతో నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పాటయింది...ఇక తెలంగాణకు సంబంధించి 117 అసెంబ్లీ స్థానాలతో పాటు 17 పార్లమెంటు స్థానాలు మిగిలాయి...ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్ర విభజన జరగడంతో పాలనా వికేంద్రీకరణ అవసరమని అప్పటి విభజన బిల్లులో స్పష్టం చేశారు...నియోజకవర్గాల పునర్విభజన తో నియోజకవర్గాల సంఖ్య పెరగాలని అందులో పొందుపరిచారు. కానీ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతున్నా నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు, నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు...కానీ 2026 నాటికి నియోజకవర్గాల పెంపు అనివార్యమని తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం...ప్రతీ పార్లమెంటు కి రెండు అసెంబ్లీ సీట్లు...ఏపీలో 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ప్రతి పార్లమెంటు స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ సీట్లు ఉంటాయి. ఈ లెక్కన 175 స్థానాలు కొనసాగుతున్నాయి...నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో ప్రతి లోక్సభ స్థానం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెంచాలన్న ఆలోచన ఉంది...2026 ద్వితీయార్థంలో పునర్విభజన ప్రక్రియ ప్రారంభం కానుంది. వీలైనంత త్వరగా పునర్విభజన ప్రక్రియ పూర్తి చేసి కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రకటించాలని కేంద్రం భావిస్తోంది...కొద్ది రోజుల్లో జనగణనతో పాటు మహిళా బిల్లు కూడా ఆమోదం పొందనుంది. 2025 లో జనగణను పూర్తిచేసి.. వెనువెంటనే మహిళా బిల్లును సైతం ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. అటు తరువాత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభం కానుంది...

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**- ముందస్తు అనుమతి లేని ర్యాలీలు, సభలకు పూర్తి నిషేధం**



**జిల్లా ఎస్పీ. వనపర్తి** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజా వాతావరణం ప్రశాంతంగా కొనసాగడం, అనవసర గుమికూడింపులు నివారించడం లక్ష్యంగా జనవరి 01 నుంచి ఫిబ్రవరి 28 వరకు 30 పోలీస్ యాక్ట్?1861 నిబంధనలు అమల్లో ఉంటాయని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, .ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్పీ మాట్లాడుతూ..వనపర్తి జిల్లా పరిధిలో ఎవరైనా పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం కఠినంగా నిషేధం. ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటిలేదు" అని స్పష్టం చేశారు. అలాగే "30 పోలీస్ యాక్ట్" ఉల్లంఘనలకు చట్టంలో స్పష్టమైన శిక్షలు ఉన్నాయి. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ప్రజల భద్రత కోసం పెట్టబడ్డాయి? అందరూ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఏ కార్యక్రమం కావాలన్నా ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి పొందండి. ప్రజల సహకారం వల్లనే శాంతిభద్రతలు నిలుస్తాయి. పోలీసుల చర్యలు ప్రజల రక్షణ కోసమేనని ఎస్పీ తెలిపారు.

## సుగవాసిని కలసిన టిడిపి నేతలు

**రాయచోటి, జనవరి03:** రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు సుగువాస ప్రసాద్ బాబును శనివారం పలువురు పార్లమెంటు పరిధిలోని టిడిపి నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు రాజంపేట పార్లమెంట్ నూతన టిడిపి అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు కలిసి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రాజంపేట నియోజకవర్గ సీనియర్ టిడిపి నేతలు..సరైన సమయంలో సమర్థుడైన యువనేతకు పగ్గాలు ఇవ్వడం మంచి నిర్ణయం అని,అలాగే ప్రసాద్ బాబు అధ్యక్షులుగా రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి,అలాగే ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండా మోస్తున్న నికార్సైన కార్యకర్తల శ్రేయస్సు కొరకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని సీనియర్ నేతలు విజ్ఞప్తి చేసారు, రాజంపేట పార్లమెంట్ టిడిపి మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య మరియు భగవాన్ రెడ్డి,ఒంటిమిట్ట మండల సీనియర్ టిడిపి నాయకుడు కిరణ్ కుమార్, నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు,సిద్దవటం మాజీ సింగల్ విండో అధ్యక్షులు సుధా మురళి ,మాధవరం కూటమి నాయకులు అవ్వారు రవిశంకర్,సుండుపల్లె మైనారిటీ నేత చాంద్ బాషా,టిడిపి నేత వేంకటాద్రి నాయుడు,వార్డ్ సభ్యులు సామల చెంగయ్య,సిద్దవటం టీడీపీ నాయకుడు పుత్తా శివానంద,తదితర కార్యకర్తలు కలిసి శాలువ కప్పి పూల బోకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారురాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో బడిశెట్టి రవి గారి ముద్దుల తమ్ముడు బడిశెట్టి భరద్వాజ్ రాయల్(చిన్న) జన్మదిన వేడుకలను తన అభిమాన నాయకుడు,రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు సంక్షంలో కేక్ కట్ చేసి బడిశెట్టి భరద్వాజ్ రాయల్ (చిన్న) ప్రసాద్ బాబు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారురాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు మర్యాద పూర్వకంగా కలిసిన డాక్టర్ హుస్సేని సాహెబ్. రాయచోటి సర్కాజీ షర్ఫుద్దీన్ డాక్టర్ హుస్సేని సాహెబ్ మైనారిటీ సోదరులతో విచ్చేసి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు శనివారం రోజు రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అన్నమయ్య జిల్లా రాయచోటి జిల్లా కేంద్రం విషయం మరియు జిల్లా సమస్యల పైన చర్చించారు.రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు కలిసిన సుండుపల్లి మండలం రాచపల్లెకు చెందిన పటాన్ దర్బార్ భాయ్ వారి మిత్ర బృంద.ఇటీవల కువైట్లో శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు అభినందన సభలో మదనపల్లి ఎమ్మెల్యే గౌరవ నీయులు శ్రీ షాజహాన్ బాషా ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరిన యువ నాయకులు పఠాన్ ఖాన్ భాయ్ గారి తమ్ముడు పఠాన్ దర్బార్ భాయ్ మిత్ర బృందం రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు శనివారం రోజు రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో కలిసి పూల మాల వేసి బోకే అందజేసి శాలువ కప్పి సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## అసెంబ్లీని రేవంత్ ప్యాలెస్లా నడిపిస్తున్నారు.. స్పీకర్పై గంగుల కమలాకర్ ఫైర్

**- మాజీ మంత్రి గంగుల కమలాకర్**

**హైదరాబాద్** ;ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కిరణ్కుమార్ రెడ్డి అప్పట్లో స్పీకర్గా ఉండే అని.. ఆ తర్వాత మనోహర్ అయ్యారని.. అయినా ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు జరగలేదని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చేదని గుర్తుచేశారు. కానీ నిన్న అసెంబ్లీలో స్పీకర్ తీరు బాధాకరమని అన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని.. మా గొంతు నొక్కలేదని గంగుల కమలాకర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలను అసెంబ్లీకి తీసుకొనిపోయామని గుర్తుచేశారు. పక్షపాత వైఖరితో ఉండకండి అని స్పీకర్ గడ్డం ప్రసాద్కు హితవు పలికారు. మీ వ్యవహార శైలిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కు ఉంటుందో అందే అందరు సభ్యులకు ఉంటుందని తెలిపారు. మా హక్కుల కోసమే మాట్లాడామని చెప్పారు.నిన్న అసెంబ్లీలో గిల్లికజ్జాలు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూశాడని గంగుల కమలాకర్ అన్నారు. మమ్మల్ని తిట్టేందుకే సభకు వచ్చాడని, కడుపునిండా తిట్టి వెళ్లాడని విమర్శించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రెండు గంటలు మాట్లాడతాడా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఎజెండా కూడా పొద్దున రెండుగంటలకు ఇస్తారా అని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంపై మాట్లాడటానికి నేను, జగదీశ్ రెడ్డి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వమని చెప్పడమేంటని స్పీకర్పై గంగుల కమలాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి మేం భజన చేయాలా అని ప్రశ్నించారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ హుందాగా నడిచిందని తెలిపారు. గత స్పీకర్ ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుత స్పీకర్ బీఆర్ఎస్ సభ్యుల గొంత నొక్కేందుకు పనిచేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీని గాంధీ భవన్లా, రేవంత్ ప్యాలెస్లా నడిపిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి భజన చేసేందుకు అసెంబ్లీకి వెళ్లాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్, సీఎం సభ సంప్రదాయాలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు.

## ఫ్యూచర్ సిటీ తర్వాత... ముందు మాకు రోడ్డు వేయండి

**రంగరెడ్డి** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పోలి?స్ స్టేషన్ పరిధిలో అపర్ణ హిల్ పార్క్, అపర్ణ సిలికాన్, అపర్ణ గార్డెనియాల నివాసితులు శనివారం రోడ్డెక్కారు. తమ ఇండ్లకు వెళ్ళేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదంటూ అవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలతో కలిసి ర్యాలీగా రోడ్డుపైకి వస్తేన్నన మా బాధలు అర్థం చేసుకుంటారని వేలాది మందితో అపర్ణ హిల్ పార్క్ నుంచి చందానగర్ 00 జీహెచ్ఎంసి కార్యాలయం వరకు ర్యాలీనిర్వహించామన్నారు.

## 63సి.పి. ఐ సీనియర్ నాయకులు "బోలెమోని"కిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాళి.



**వనపర్తి** కమ్యూనిస్టు ఉద్యమ నేత ప్రస్తుత సి.పి. ఐ నాయకులు బోలెమోని.నాగన్న అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నాగన్న కమ్యూనిస్టు నేతగా,నిస్వార్థ సేవకులుగా ప్రజలకు అందుబాటులో ఉన్నారని ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుమారుడు సీనియర్ జర్నలిస్ట్ రమేష్ మరియు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.నిరంజన్ రెడ్డి వెంట బి.ఆర్.ఎస్ నాయకులు ఉన్నారు.

# గ్రామంలో మత్తు పదార్థాల నిర్మూలనకు అధికారులతో సమన్వయం - గ్రామ సభ నిర్ణయం

- డ్రగ్స్ నియంత్రణతో పాటు గ్రామాభివృద్ధికి నాంది
- మత్తు పదార్థాలకు చెక్ - అభివృద్ధి పనులకు తీర్మానాలు
- బోయినిపల్లి గ్రామ సర్పంచ్ : నల్ల మోహన్






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి గ్రామంలో మత్తుపదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని సర్పంచ్ నల్ల మోహన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పంచాయతీ గ్రామసభలో తీర్మానం చేశారు. గ్రామ యువత డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్న పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, అధికారులతో సమన్వయంతో ఈ దుష్ప్రభావాన్ని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధి అంశాలపై గ్రామసభలో చర్చించి, మంచినీటి సమస్య పరిష్కారం కోసం నాంది ఫౌండేషన్ ప్లాంట్ నిర్వహణ, విధిదీపాల ఏర్పాటు, బస్టాండ్ సమీపంలో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, ఓపెన్ జిమ్-రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు, డ్రైనేజీ నిర్మాణం, కోతుల బేడుదా నుంచి రక్షణ చర్యలు, పారిశుధ్య పనులను క్రమబద్ధీకరించడం వంటి పనులను అమలు చేస్తామని వెల్లడించారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా ప్రజల భాగస్వామ్యంతో పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ మెరుపుల చందన, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, కారోబార్, గ్రామ పెద్దలు, యువత, ప్రజలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

# నూతన ప్రజాప్రతినిధులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం - శుభాకాంక్షలు

- యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ అధ్యక్షులు : న్యాత నవీన్



కథలాపూర్ / వేములవాడ (ప్రశ్న న్యూస్) వేముల8 నియోజకవర్గం,కథలాపూర్ మండలంలో ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని నవీన్ పిలుపునిచ్చారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పారదర్శక పాలన అందించాలన్నారు.

**సన్మానితులు**

దూలూర్‌కు చెందిన రహీమ్ అజీమ్, తక్కళ్ళపల్లికి చెందిన భూపెల్లి రాజ గంగారం, వార్డు మెంబర్లు లింగ గౌడ్, పోశయ్య, సిరికొండకు చెందిన ముధం రవి, కథలాపూర్‌కు చెందిన న్యావనంది శేఖర్, ఉపసర్పంచ్ ప్రశాంత్, ఊట్పల్లికి చెందిన పాల లక్ష్మి శివారెడ్డి, ఉపసర్పంచ్ మోదం శేఖర్, వార్డు మెంబర్ ప్రమోద్, పెగ్గర్లకు చెందిన కుంటాల లక్ష్మి నరేష్, ఉపసర్పంచ్ పాల్తం లక్ష్మి గంగారామ్, తంద్రియాలకు చెందిన జంగా శివాని, రంజిత్, పోసానిపేట్‌కు చెందిన ఆకుల సుజాత, రాజేందర్, రాజారామ్ తండాకు చెందిన భూక్య తిరుపతి, తోర్తికి చెందిన నాయిని గౌతమి, మహేష్‌లేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కశవర్తి వంశీ, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల సంతోష్‌తో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు లవ కుమార్, కస్కంటి అశోక్, సమర్పన్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రారంభం



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ను నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలను ఎంపిక చేసి ప్రజల ఉపాధి స్థితిగతులు, ఉపాధి అవకాశాలు, ఆదాయ పరిస్థితులు వంటి అంశాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదట సాధారణ వివరాలతో సర్వే చేపట్టి, అనంతరం ట్యాబ్‌లే సహాయంతో ఎంపిక చేసిన కుటుంబాలపై మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, ప్రత్యేక ట్యాబ్‌లో వివరాలు నమోదు చేస్తామని వివరించారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల సంఖ్య, వారి విద్యార్హతలు, చదువు మానేసిన పరిస్థితులు, ఉన్నత విద్య, వృత్తివిద్య కోర్సులు, ఉద్యోగం లేదా స్వయం ఉపాధి వివరాలను నమోదు చేస్తారు. రోజువారీ కూలీలయితే వారంలో చేసిన పనులు, పని గంటలు, పొందిన వేతనం వంటి వివరాలు సేకరిస్తారు. మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నట్లయితే వారి ఆదాయ వివరాలు కూడా నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, ఎంపీ ఈఎస్ఓ తిరుపతి, మున్సిపల్ బిల్ కలెక్టర్ జగదీష్, మున్సిపల్ మెప్మా సెక్షన్ సిబ్బంది జ్యోతి, భూదేవి, మున్సిపల్ సిబ్బంది ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో తగ్గిన రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్,** తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవడానికి మార్కెట్ విలువల పెంపును నిలిపివేసినా, ఆ రంగం ఇంకా గడ్డు పరిస్థితుల్లోనే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో (డిసెంబర్ వరకు) గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల సంఖ్య సుమారు 50,000 తగ్గింది. గత ఏడాది 13 లక్షల డాక్యుమెంట్లు నమోదు కాగా... ఈసారి 12.50 లక్షలకే పరిమితమయ్యాయి. అయితే... రిజిస్ట్రేషన్లు తగ్గినా ఆదాయం రూ. 11,100 కోట్లకు పెరగడం విశేషం. హోమ్ లోన్ల కోసం రైతులు ఆస్తి విలువను ఎక్కువగా చూపడమే దీనికి కారణం. అయినప్పటికీ, ప్రభుత్వం నిర్దేశించుకున్న రూ. 19,100 కోట్ల వార్షిక ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడం ప్రస్తుతం అధికారులకు పెద్ద సవాలుగా మారింది.తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని తిరిగి బలోపేతం చేసేందుకు మార్కెట్ విలువల సవరణను తాత్కాలికంగా నిలిపివేయడం.. బిల్డర్లలో మనోధైర్యాన్ని నింపేలా సానుకూల నిర్ణయాలు తీసుకోవడం వంటి అనేక చర్యలు చేపట్టింది. అయినప్పటికీ.. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం ఇంకా సంక్షోభం నుండి పూర్తిగా బయటపడలేదని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డిపార్ట్ మెంట్ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో (డిసెంబర్ వరకు) ఆస్తుల రిజిస్ట్రేషన్ల సంఖ్య ఆందోళనకరంగా తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సుమారు 50,000 రిజిస్ట్రేషన్స్ తక్కువగా నమోదయ్యాయి. గత ఏడాది డిసెంబర్ నాటికి 13 లక్షల డాక్యుమెంట్లు నమోదు కాగా.. ఈసారి ఆ సంఖ్య 12.50 లక్షలకు పడిపోయింది. ఇందులో నివాస, వాణిజ్య ప్రాంతాల రిజిస్ట్రేషన్లతో పాటు వివాహ నమోదులు, మ్యుటేషన్లు కూడా ఉన్నాయి.రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గినప్పటికీ.. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో స్వల్ప పెరుగుదల కనిపిస్తోంది. గత ఏడాది ఇదే సమయానికి రూ. 10,500 కోట్ల ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ. 11,100 కోట్లు సమకూరాయి. అయితే.. ప్రభుత్వం నిర్దేశించుకున్న రూ. 19,100 కోట్ల భారీ ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడం ఇప్పుడు క్లిష్టంగా మారింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మొత్తం రూ. 14,230 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మిగిలిన మూడు నెలల్లో సుమారు రూ. 7,800 కోట్లు వసూలు చేయాల్సి ఉంటుంది.. ఇది దాదాపు అసాధ్యమని అధికారులు భావిస్తున్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, సెప్టెంబర్ , నవంబర్ నెలల్లో మాత్రమే రిజిస్ట్రేషన్లు ఆశాజనకంగా సాగాయి. మిగిలిన నెలల్లో వృద్ధి మందగించిందని సర్వేలు చెబుతున్నాయి. ముఖ్యంగా డిసెంబర్ నెలను 'పేలవమైన పనితీరు' ఉన్న నెలగా అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో 1.15 లక్షల రిజిస్ట్రేషన్లు జరగ్గా.. ఈ ఏడాది కేవలం 1 లక్ష మాత్రమే నమోదయ్యాయి. దీనికి భిన్నంగా జూలై 2024లో 2 లక్షల రిజిస్ట్రేషన్లు జరగ్గా.. జూలై 2025లో అవి 1.65 లక్షలకు తగ్గిపోయాయి.అమ్మకాలు తగ్గినా ఆదాయం పెరగడానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. ప్రస్తుతం కొనుగోలుదారులు ఎక్కువగా బ్యాంకు రుణాలపై ఆధారపడుతున్నారు.

ఎక్కువ లోన్ పొందడం కోసం ఆస్తి విలువను ఎక్కువగా చూపిస్తూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మరో కారణం ఏంటంటే.. హైదరాబాద్ , దాని చుట్టుపక్కల జిల్లాల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడం వల్ల.. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ విలువకే రిజిస్ట్రేషన్లు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో గత ఏడాది కంటే 20 శాతం అదనపు ఆదాయం వచ్చినా అది పెద్ద విజయమేనని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# సమిష్టిగా పని చేస్తేనే మంచి ఫలితాలు సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం...దగా అని అర్థం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**జయశంకర్ భూపాలపల్లి.జనవరి 03** సమిష్టిగా సమన్వయంతో ముందుచూపుతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించుకోవచ్చని మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాముత్తారం మండల కేంద్రంలో శనివారం ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాముత్తారం మండలంలో బీఆర్ఎస్ నాయకత్వం పటిష్టంగా ఉందని, గొప్పగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఇటీవల జరిగిన స్తానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు, అధికారం ఏ మాత్రం పని చేయలేదని అర్థం అవుతుందన్నారు. డబ్బు అధికారం అక్కడక్కడ మాత్రమే పని చేసిందని, అనేక గ్రామాల్లో ప్రజలే విజయంసాధించారన్నారు. మనలో కొంత సమన్వయ లోపం ఉందని అంటున్నారని, కానీ కాంగ్రెస్సోళ్లు తెలివిగా పోతున్నారని, మనం అమాయకత్వంతో నమ్ముతున్నామని, జాగ్రత్త పడకపోవడమే మనకు శాపం అవుతుందన్నారు. రాబోయే ఎంపీటీసీ జెడ్పీటీసీఎన్నికల నేపధ్యంలో ప్రతి ఒక్కరు టీం వర్క్ చేసి మన అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే ప్రస్తుతం గెలిచిన సర్పంచ్‌లకు ప్రలోభాలకు గురి చేసి పార్టీలోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తారని, వారి ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో సర్పంచ్‌లకు ఏ పని కాదని, ప్రభుత్వం వద్ద నిధులు లేవని, కేంద్రంనుంచే నేరుగా వస్తాయన్నారు. ఇప్పటికే రెండేళ్లు గడిచిపోయిందని, మరో ఏడాది అటూ ఇటూ వెళ్లినా మరో రెండేళ్లు కష్టపడితే అటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా మోసమని, ఏదోపనిచేస్తామంటూ మభ్యపెట్టడం వారి నైజమన్నారు. గతంలో దుద్దిళ్ల శ్రీధర్ మంత్రిగా ఉన్న సమయంలో మంథని మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామ పరిధిలోని బైరన్‌గడ్డకు రోడ్డు వేయిస్తానని అక్కడి రాజయ్యతో ఫోన్ మాట్లాడాడని,కానీ ఇప్పటి వరకు రోడ్డు వేయించలేదన్నారు. ఓట్లు వస్తేనే

# సంప్రదాయానికి ప్రతీక..చేనేత..

- కళింగలో జాతీయ చేనేత ప్రదర్శన

**హైదరాబాద్** సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే చేనేతనే వస్త్ర ప్రదర్శన బంజారాహిల్స్ లో ప్రారంభమైంది. నగరంలోని కళింగ కల్చరల్ హాల్లో జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన పేరుతో ఏర్పాటైన ఈ ఎగ్జిబిషన్ని సోషలైట్ అలేఖ్యరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హాల్లో కొలువుదీరిన చేనేతకారుల వస్త్ర ఉత్పత్తులను ఆమె తిలకించారు. నేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత గురించి అడిగి తెలుసుకుంటూ సందడి చేశారు. చేనేత ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటితరం యువత కూడా హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని అలేఖ్యరెడ్డి అన్నారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ ఈ నెల 11 వరకూ కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, నేత బృందాలు తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 74 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

# ఫ్యాషన్ జిరాఫి ఎగ్జిబిషన్

**హైదరాబాద్** దేశంలోని ప్రఖ్యాత డిజైనర్లు తీర్చిదిద్దిన డిజైనర్ దుస్తులు ప్రదర్శన ఫ్యాషన్ ప్రియుల కోసం అన్ని రకాల వస్త్ర ఉత్పత్తులు ఒకే వేదికపై అందుబాటులో ఉంచినట్లు యువ డిజైనర్ ఫ్యాషన్ ఇన్ఫ్లూయెన్సర్లు ఎస్. మానసరెడ్డి, స్నేహ, స్నిగ్ధలు వెల్లడించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లేబుల్స్ పాప్ అప్ స్పేస్ లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాషన్ జిరాఫి ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ది వెడ్డింగ్ ఎడిట్ ఫ్యాషన్ జిరాఫీ పాప్ అప్ పేరుతో నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్లో 40 మంది ప్రఖ్యాత డిజైనర్లు తమ ఉత్పత్తులు ప్రదర్శిస్తారని సమావేశంలో వెల్లడించారు. కోల్కత్తా, బెంగుళూరు, లక్నో, ఇండోర్ తదితర నగరాల నుంచి పేరెన్నిక గన్న దుస్తుల బ్రాండ్లు ఈ ప్రదర్శనలో ఆకట్టుకోనున్నాయని పేర్కొన్నారు. ఇండియన్ ట్రెడిషన్ తో పాటు ఇండో వెస్ట్రన్, పార్టీ , వెడ్డింగ్ , కిడ్స్, మెన్స్ వేర్ ను ఇక్కడ అందుబాటులో ఉంచామన్నారు. ఫ్యాషన్ ప్రియులకు, నగర మహిళలకు ఈ ప్రదర్శన సరికొత్త ఆకృతులను అందించబోతున్నదని పేర్కొన్నారు.


# కెమికల్స్ పంపేనిలో పేలుడు

**అనకాపల్లి** రాంబిల్లి మండలం సెజ్ లో ఎస్విఎస్ కెమికల్స్ లో పేలుడు సంభవించింది. నిల్వ ఉంచిన సాల్వెంట్ ఆయిల్ పీపాలు పేలిపోయాయి. వరుసగా ఆయిల్ డ్రమ్ముల పేలడంతో పోగ కమ్మేసింది. ఎగసిపడుతున్న మంటలతో భారీగా పొగ విస్తరించింది.

## భూ సమస్యల పరిష్కారానికి

# ప్రభుత్వ కీలక నిర్ణయాలు

- ప్రజల సంతృప్తి పెంపే లక్ష్యంగా సమన్వయంతో కార్యాచరణ
- రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలుజిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల, జనవరి 03 :** భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో, వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో భూసమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్‌తో కలిసి రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, దీర్ఘకాలిక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలకమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. వివిధ రకాల భూ సమస్యలపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలను జారీ చేసిందన్నారు. ఈ విధానాల అమలులో భాగంగా భూ సమస్యల పరిష్కారానికి బాధ్యతలను అధికారులకు కేటాయించినట్లు తెలిపారు.

# సమాజ దార్శనికురాలు సావిత్రిబాయి పూలే

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్.

**బద్వేలు** భారత సామాజిక చరిత్రలో పితృ స్వామిక అంధకారాన్ని చీల్చి, అణగారిన వర్గాలకు విద్యా దీపం వెలిగించిన తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే నేటి సమాజానికి దార్శనికురాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో బద్వేల్ లోని స్థానిక సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదన విజయకుమార్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, స్త్రీ విద్య, సామాజిక సంస్కరణకు అంకితమైన ఉద్యమకారిణిగా గుర్తింపు పొందారన్నారు. బాల్య వివాహానికి గురైన సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావు పూలే సహకారంతో విద్యనభ్యసించి, అనంతరం 1848వ సంవత్సరంలో జ్యోతిరావు పూలే సహకారంతో పూణేలో మొదటి మహిళా పాఠశాలను స్థాపించి కుల మతాలకు అతీతంగా స్త్రీలకు విద్యనందించారన్నారు. బాల్య వివాహాలకు, వితంతు వివక్షకు వ్యతిరేకంగా మహిళా సేవా మండలి స్థాపించి పోరాడటమే కాకుండా, సత్యశోధక సమాజంలో మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి కులాంతర వివాహాలు, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారన్నారు. అనాధ బాలలు, స్త్రీల కొరకు ఆశ్రమాలను నడిపి బాల్య వివాహాలు, సతీసహగమనం వంటి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమించారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సావిత్రిబాయి పూలే జయంతి, వర్ధంతిల సందర్భంగా సభలు, సమావేశాలు, వేడుకలు నిర్వహిస్తున్నారే తప్ప ఆమె ఆశయ సాధనకై కృషి చేయడం లేదన్నారు. దేశంలో విద్య, సమానత్వం, దళిత-బహుజనుల హక్కులు, మహిళా విముక్తి వంటి హక్కుల సాధనలో పాలకులు చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని ఆరోపించారు. సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం విద్యావేత్తలు, మహిళా సంఘాలు, అభ్యుదయవాదులు కృషి చేయాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, బద్వేల్ మండల అధ్యక్షులు ఎస్.దేవానందం, సహాధ్యక్షుడు వై.రామయ్య, ట్రెజరర్ ఎ.లాజరయ్య, గోపవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మస్తాన్ వలి, ఎం.రామచంద్రయ్య, బద్వేలు మండల కార్యదర్శి సి.హెచ్.సాగర్, నాయకులు పి.ఆర్థర్, జి.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఎన్నిక

- యూనియన్ మండల అధ్యక్షుడిగా అంజి

**కౌతాళం** మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఏపీయూడబ్ల్యూజే నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ భాష,జిల్లా సహకారదర్శి హనుమేష్, తాలూకా అధ్యక్షుడు జయరాజు, పాల్గొన్నారు.

మండల గౌరవ అధ్యక్షులు రామాంజనేయులు, గౌరవ సలహాదారులు మహమ్మద్, మండల అధ్యక్షులుగా బి.అంజిని, ఉపాధ్యక్షులు శివకుమార్,ముక్తర్ బాష,సాదిక్, రాము,ఫర్ క్,ప్రధాన కార్యదర్శి కాకంరామాంజనేయులు,ఆర్గనైజర్ కార్యదర్శి బలరాం,కోశాధికారి అనిల్,సహకార్యదర్శులు శరణం బసవ, ఉసేన్ ,తోవి ఈరన్న ,రమేష్ బసవరాజు, సభ్యులు మహమ్మద్, బసవ, రామ్మూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవనకొండ మండల కేంద్రము నందు రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించాలి

**దేవనకొండ** మండల కేంద్రమైన దేవనకొండ నందు స్టేట్ బ్యాంకు నుండి భారత్ పెట్రోల్ బంకు వరకు ప్రధాన రహదారిపై ఉన్న మట్టిని తొలగించాలని సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి వి. రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె. భాస్కర్ లు డిమాండ్ చేశారు. శనివారం దేవనకొండ మండల కేంద్రం నందు ప్రధాన రహదారులను సీపీఐ బృందం పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండల కేంద్రమైన దేవనకొండ ప్రధాన రహదారులపై మట్టి ఉన్నందువలన వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కర్నూల్ రోడ్ లో ప్రధాన రహదారిపై భారత్ పెట్రోల్ బంక్ వరకు రాకపోకలకు ముళ్ళకంపలు ఉండడం వలన వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలు ప్రమాదాలు ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. కావున ప్రధాన రహదారిపై ఉన్న మట్టిని, ముళ్లకంపలను తొలగించి వాహనదారులకు ప్రయాణికులకు ఉన్న ఇబ్బందులు తొలగించాలని విద్యార్థి, యువజన సంఘాలుగా కోరారు. అనంతరం మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి జి.రాముడు కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవ కారిణి

**ఆడబిడ్డలకు అక్షరాన్ని పరిచయం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే**

**నీలం మధు ముదిరాజ్**



పటాన్‌చేరు(ప్రశ్న న్యూస్) మహిళల సమానత్వం కోసం వారి అభ్యున్నతి కోసం ఉద్యమం చేసిన సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని చిట్కుల్లోని ఆయన నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే మహిళలకు విద్యను సులభతరం చేసేందుకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ అనేక రకాల కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఆమె సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఆమె జయంతి అయిన జనవరి 3వ తేదీని ప్రతి ఏట మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులందరికీ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు ఆయన తెలిపారు.

# ఓటర్ జాబితాలో తప్పులపై 6 న కలెక్టర్ కి కంప్లైంట్ ఇస్తాం

**- నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్ నందు నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్ ల అధ్యక్షులు, ఇంచార్జీ లకు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఓటరు జాబితా విడుదల చేయడం జరిగింది .ఆ జాబితాలో ఎన్నో తప్పులను మేము గుర్తించడం జరిగింది.

అన్ని డివిజన్ లలోని మాజీ కార్పొరేటర్లు,అధ్యక్షులు, ఇంచార్జ్ ఓటర్ జాబితాను పరిశీలించడం జరిగింది. బీజేపీ నాయకుల మాదిరిగా కేవలం పది నిమిషాలు చూసి తప్పులు ఉన్నాయని అధికారుల దగ్గరికి వెళ్ళే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది కాదు. బీజేపీ నాయకులు ఒకరు మాట్లాడుతూ కాంగ్రెస్ లో అభ్యర్థులు లేరు అని మాట్లాడుతున్నారు. ఒక్కసారి కాంగ్రెస్ కార్యాలయాన్ని చూసి ఆ మాట మాట్లాడాలి ఒక్కో డివిజన్ నుండి దాదాపు 10 మంది పోటీలో ఉన్నారు.ఈ నెల 5 వ తేదీన మున్సిపల్ కమిషనర్ ను,6 వ తేదీన కలెక్టర్ ని ఓటర్ జాబితాలో తప్పులపై కలుస్తాము అని అన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి సుపరిటాండెంట్ విజయలక్ష్మి పదవి విరమణ



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) బాన్సువాడ నియోజకవర్గ బాన్సువాడ పట్టణ కేంద్రంలోనీ ప్రభుత్వ ఆసుపత్రి సుపరిటాండెంట్ విజయలక్ష్మి పదవి విరమణ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు మాజీ మంత్రివర్యులు బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,తన పదవీకాలంలో అంకితభావంతో, నిస్వార్థ సేవా భావంతో ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రశంసించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు అవసరమైన సమయంలో సేవలు అందించారని వారు చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.పదవి విరమణ అనేది సేవలకు ముగింపు కాదు, అనుభవంతో సమాజానికి మరింత మార్గదర్శకత్వం చేయాల్సిన కొత్త ఆరంభమని వారు తెలిపారు. భవిష్యత్తులో కూడా వారి సామాజిక సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం విజయలక్ష్మి కి పూలమాలలు, శాలువాలతో సన్మానం చేసారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ సొసైటీ మాజీ చైర్మన్ ఏర్వాల కృష్ణారెడ్డి , మాజీ ఎంపీపీ ఎజాస్ , మాజీ జెడ్పిటిసి గోపాల్ రెడ్డి , ఆల్ ఇండియా బంజారా సేవా సమితి తెలంగాణ రాష్ట్ర ఉపఅధ్యక్షులు మోహన్ నాయక్ తదితర ప్రజా ప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేదిక్ మ్యాథ్స్ తరగతులు విజయవంతం







విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) డ్రీమ్స్ స్టూడియోను దుర్గ ప్రసాద్, రమ దేవి కోర్సెస్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరం నవంబర్ 16న, శ్రీ సాయి రాజేశ్వరి ఎడ్యుకేషనల్ అకాడమీ ద్వారా నిర్వహించబడిన అంతర్జాతీయ వేదిక్ మ్యాథ్స్ లైవ్ ప్రోగ్రామ్ లో డ్రీమ్స్ స్టూడియో, విశాఖపట్నం విద్యార్థులు విజయవంతంగా పాల్గొన్నారు. ఈ సంస్థ శ్రీరామ్ నగర్, శ్రీనగర్, విశాఖపట్నం లో కొనసాగుతూ అబాకస్, వేదిక్ మ్యాథ్స్ తరగతులను విజయవంతంగా నిర్వహించారు.డ్రీమ్స్ స్టూడియో విద్యార్థులు వివిధ వేదికలపై పాల్గొని తమ ప్రతిభను చాటుతూ సంస్థకు మంచి పేరు తీసుకు వస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి వేదిక్ మ్యాథ్స్ ట్రైనర్స్ విద్యార్థులకు ప్రత్యక్షంగా శిక్షణ అందించారు.ఈ లైవ్ ప్రోగ్రామ్‌తో డ్రీమ్స్ స్టూడియో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల్లో వివిఎస్ సాయి శ్రీజ, వెంకట్ సాయి రితీష్, పూర్వి తదితరులు విశేష ప్రతిభ కనబరిచారు.వారి తల్లిదండ్రులు రవికాంత్, లక్ష్మి , నరసింహమూర్తి, శైలికళ, వెంకట్ సాలిచ్, శిల్ప పిల్లలకు అందించిన సహకారం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమం డ్రీమ్స్ స్టూడియోకు మరింత గుర్తింపును తీసుకొచ్చిందని తెలిపారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాల 75 వసంతాల వేడుకలు

**కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా**




పటాన్‌చేరు(ప్రశ్న న్యూస్) కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్య బోధన అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం రామచంద్రాపురం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పాఠశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అందించాలన్న సమున్నత లక్ష్యంతో పటాన్చెరు పట్టణంలో ప్రభుత్వ విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సైతం ప్రారంభించడం జరిగిందని తెలిపారు.. అతి త్వరలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల సైతం ఏర్పాటు కాబోతుందని తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించి చదువుకున్న పాఠశాలకు పుట్టిన ఊరుకు మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. మాదకద్రవ్యాల రహిత సమాజం ఏర్పాటులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, గోదావరి అంజిరెడ్డి, పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, కుమార్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల విద్యకు మార్గదర్శకురాలు సావిత్రిబాయి పూలే

**- సామాజిక న్యాయానికి స్ఫూర్తి సావిత్రిబాయి పూలే**

**- ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు, బోయినిపల్లి సెస్ డైరెక్టర్ : కొట్టెపల్లి సుధాకర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ శనివారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, మహిళల విద్య కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సావిత్రిబాయి పూలే సమాజ మార్పుకు మార్గదర్శకురాలిగా నిలిచారని అన్నారు. కుల,లింగ వివక్షలకు ఎదురీదుతూ విద్యనే ఆయుధంగా చేసుకొని సమానత్వం కోసం పోరాడిన ఆమె స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ముఖ్యంగా దళిత, పేద వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిస్తూ విద్య, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ది జర్నలిస్ట్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ జూబ్లీహిల్స్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు గోపరాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఉపాధ్యక్షుడు ఎం. లక్ష్మి నారాయణ, కార్యదర్శి రవీంద్ర బాబు, సంయుక్త కార్యదర్శి భాగ్యలక్ష్మి, కోశాధికారి మహేశ్వర్ గౌడ్, డైరెక్టర్ కమలాకర చారి పాల్గొన్నారు.

# సర్కారు బడుల విద్యార్థుల భవిత కోసం బీజేపీ సేవా కార్యక్రమం

**- కోరెం,వెంకట్రావుపల్లి,నర్సింగాపూర్ గ్రామాల్లో టెన్త్ విద్యార్థులకు ఉచిత సైకిళ్ళు పంపిణీ**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పర్శరాం**



బోయినిపల్లి ( ప్రశ్న న్యూస్) కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్ఫూర్తితో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.బోయినిపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి, కోరెం,నర్సింగాపూర్ గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశురాం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పేద కుటుంబాలకి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో సి.ఎస్.ఆర్ నిధులతో సైకిళ్లు అందజేసినట్లు పర్శరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపల్లి సర్పంచ్ సంధ్య, కొత్తపేట సర్పంచ్ ఇల్లందుల రాజేశం, స్థంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, కోరెం సర్పంచ్ జంపుక మాధవి –ఆనంద్,ఉపసర్పంచులు, మండల విద్యాధికారి, బీజేపీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నర్సింహాచారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి,పాలోజు రాజేంద్ర ప్రసాద్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, బూత్ అధ్యక్షులు ఇల్లందుల బాలయ్య, రాజు, బుర్ర ప్రదీప్, సట్టు వంశీ, నడిగట్టు శ్రీనివాస్, గ్రామ ప్రజలు, విద్యార్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జేఈఈ నీట్ లో రామంతాపూర్ శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభకు సన్మానం



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) దేశ వ్యాప్తంగా నిర్వహించే జేఈఈ అడ్వాన్స్, నీట్ పరీక్షల్లో శ్రీ చైతన్య స్కూల్ రామంతాపూర్ బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ ప్రతిభతో విద్యార్థులు ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారని విద్యావేత్తలు ప్రశంసించారు. ప్రతిభ చూపిన పూర్వ విద్యార్థులను శనివారం పాఠ శాలకు ఆహ్వానించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణగూడ జోన్ ఏ.జి.యం. నూర్ మహమ్మద్ అలి ప్రతిభ కనపరిచిన డి. కార్తికేయ ఐ.ఐ.టి పాట్నా,వి.దినాకర్ ఐ.ఐ.ఐ.టి గౌహతి, కె.హృతిక్ యం.బి.బి.యస్ గాంధీ, సంతోష్ రెడ్డి నీట్ చెన్నై ,యన్. అనురూప్ రెడ్డి ఐ.ఐ.ఐ.టి శ్రీ సిటీ చిత్తూర్,హిరణ్ మయి ముత్యాల ఐ.ఐ.టి శ్రీసిటి చిత్తూర్, యన్. లోకేష్ రెడ్డి ఐ.ఐ.టి మండి,ఏ. నితీష్ యన్.ఐ.టి. రుర్కెల విద్యార్థులను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువు కుంటే మంచి భవిష్యత్తును నిర్మించుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు సైతం సరైన మార్గ దర్శకులుగా నిలుస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో రీజినల్ ఇంచార్జ్ బి.వెంకటేశ్, జోనల్ అకాడమిక్ కో ఆర్డినేటర్స్ సి.మెచ్. పుల్లారావు, రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు భాగ్య లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ శ్రీ కీర్తి కోన, డీన్ నాగరాజు, ఐ.పి.యల్.సి.బ్యాచ్ ఇంచార్జులు వెంకటేశ్ గుప్త, అరుణ్ కుమార్ మరియు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముచ్చటగా మూడోసారి
# కాంబో రిపీట్



హీరో విశాల్ రీసెంట్‌గా 'మదగజరాజా' మూవీతో సెన్సేషనల్ హిట్ కొట్టిన సంగతి తెలిసిందే. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌లో వరలక్ష్మి శరత్‌కుమార్, అంజలి హీరోయిన్లుగా నటించారు.జెమిని ఫిల్మ్ సర్క్యూట్ నిర్మించిన ఈ సినిమా 2025 సంక్రాంతి సందర్భంగా తమిళంలో విడుదలై అంచనాలకు మించి విజయాన్ని అందుకుంది. ఎప్పుడో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం 12 ఏళ్ల తర్వాత థియేటర్లలో అడుగుపెట్టి ఘన విజయం అందుకుంది.అంతేకాకుండా బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ క్రమంలో విశాల్-సుందర్ సి కాంబినేషన్‌లో మరో కొత్త సినిమా రాబోతోందన్న వార్తలు కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. ఇప్పటికే 'ఆంబల', 'మదగజరాజా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్లు ఇచ్చిన ఈ జోడీ మూడోసారి కలిసి పనిచేయడానికి సిద్ధమవుతోందని సమాచారం. ఈ కొత్త చిత్రంలో సెన్సేషనల్ బ్యూటీ కయాదు లోహర్‌ను ఫిక్స్ చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం దర్శకుడు సుందర్ సి 'మూక్కుత్తి అమ్మన్-2' పనుల్లో బిజీగా ఉండగా, విశాల్ 'మకుటం' సినిమాలో నటిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయ్యాక కొత్త సినిమాను ప్రారంభించే అవకాశముందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇందులో నిజమెంతుందో తెలియనప్పటికీ ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## డీమాంటి కాలనీ 3
# ఫస్ట్ పోస్టర్‌కే వణికించిన మేకర్స్..

హారర్ ఫిల్మ్ అంటే గుర్తొచ్చే సినిమాల్లో 'డీమాంటి కాలనీ' ముందు వరుసలో ఉంటుంది. అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరెక్కిన ఈ సినిమాకు భారీ ఫాలోయింగ్ ఉంది. 2015లో ఈ మూవీ రిలీజ్ కాగా సూపర్ సక్సెస్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత వచ్చిన 'డీమాంటి కాలనీ 2' కూడా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. అరుల్ నిధి, ప్రియా భవానీ శంకర్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ ఫ్రాంచైజ్‌కు మూడో భాగంగా 'డీమాంటి కాలనీ- 3' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆ పోస్టర్‌ను చూస్తే భయపెట్టిస్తుండగా.. గర్భంతో ఉన్న ప్రియా భవానీ శంకర్ పోస్టర్.. పొట్ట ప్రాంతంలో బ్లడ్ షేడ్స్.. రక్తంతో నిండిన చేతులతో పిలుస్తూ.. వెన్నులో వణుకు పుట్టించేలా రూపొందించారు. క్యాండిల్స్ మధ్యలో కూర్చున్న ఆమె లుక్ చూస్తుంటే.. ఈ సారి కూడా హారర్ ప్రియులకు కావాల్సినంత స్టఫ్ దొరుకుతుందని.. సినిమాను బాగా ఎంజాయ్ చేస్తారని తెలుస్తోంది.



## నటి రోహిణి కీలక వ్యాఖ్యలు



సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలకు సినీ నటి రోహిణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మహిళల పాత్ర, వస్త్రధారణ,సమానత్వం వంటి అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. వస్త్రధారణ విషయంలో మహిళలకే నిబంధనలుగా మారుతున్న పరిస్థితిని ప్రశ్నించిన రోహిణి, 'మగవారికి పద్ధతులు ఉండవా?' అని నిలదీశారు. తాము పుట్టిన దేశ సంప్రదాయాల ప్రకారం వస్త్రధారణ ఉండాలంటే తప్పేంటని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలు హీరో శివాజీ, యాంకర్ అనసూయకు పరోక్ష కౌంటర్‌గా పలువురు భావిస్తున్నారు. మహిళలు ఇంట్లో చేసే పనికి సమాజంలో సరైన విలువ దక్కడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జీతం లేని శ్రామికులుగా మహిళలు మిగిలిపోతున్నారని, ఈ పరిస్థితి మారాలంటే కుటుంబంలోనూ సమానత్వం రావాలని అన్నారు. అబ్బాయిలు కూడా ఇంటి పనులు, వంట పనులు చేయాలని స్పష్టం చేశారు. ఇక వస్త్రధారణ అంశంపై మాట్లాడుతూ, చీరలు కట్టుకోవడం మనకు అలవాటు. భారతదేశ సంప్రదాయం ప్రకారం మనం చీరలు కట్టుకుంటున్నాం. విదేశాల్లో వారు షార్ట్స్ వేసుకుంటారు. ప్రతి దేశానికి, ప్రతి సమాజానికి తన అలవాట్లు ఉంటాయని రోహిణి తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తమ సంప్రదాయాలు, అలవాట్ల ప్రకారం మంచి దారిలో నడిపించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె హితవు పలికారు.

## బాలీవుడ్ ఎంట్రీపై
# క్లారిటీ ఇచ్చిన కృతి శెట్టి..



యంగ్ బ్యూటీ కృతి శెట్టిప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమకు కొంత దూరంగా ఉంటుందనే చర్చలు జరుగుతున్నాయి. 'ఉప్పెన'తో భారీ హిట్ అందుకున్నప్పటికీ, తెలుగులో ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో ఆమె తమిళ, మలయాళ చిత్రాలపై ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం కృతి నటించిన మూడు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాటి రిలీజ్ వాయిదా పడుతూ వస్తోంది. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ, వా వాతియార్, జీని మూవీస్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఈ నేపథ్యంలో కృతి బాలీవుడ్‌పై దృష్టి పెట్టిందన్న వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. హిందీలో ఓ పెద్ద ప్రాజెక్ట్ చేయబోతుందన్న పుకార్లు కూడా వినిపించాయి. తాజాగా ఈ వార్తలపై స్పందించిన కృతి శెట్టి క్లారిటీ ఇచ్చింది. "నేను ముంబైలో పుట్టి పెరిగాను. అందుకే హిందీలో పని చేయడం నాకు ఎప్పటినుంచో ఇష్టం. తమిళం, తెలుగు, మలయాళం లాంటి భాషలు నేర్చుకోవాల్సి వచ్చినా, హిందీ మాత్రం నా మాతృభాష లాంటిదే. నేను నటన వర్క్‌షాప్‌లకు వెళ్లినప్పుడు అక్కడి చర్చలన్నీ హిందీలోనే ఉండేవి. అందువల్ల ఆ ప్రక్రియ నాకు చాలా సులభంగా అనిపించేది. హిందీలో పని చేయడం పట్ల అదే నన్ను మరింత ఉత్సాహపరుస్తోంది.కెరీర్ ప్రారంభంలో హిందీలో కొన్ని అవకాశాలు వచ్చాయి. కానీ డేట్స్ కుదరకపోవడం, అక్కడి పని విధానం దక్షిణాదితో పోలిస్తే భిన్నంగా ఉండడం వల్ల వాటిని అంగీకరించలేకపోయాను. బాలీవుడ్‌లో సాధారణంగా అన్ని షెడ్యూల్స్ ముందే ప్లాన్ చేస్తారు. అలాగే నా తొలి హిందీ సినిమా ఎలా ఉండాలనుకున్నానో, ఆ అవకాశాలు దానికి సరిపోలలేదు. అయితే త్వరలోనే హిందీలో మంచి అవకాశం వస్తుందని ఆశిస్తున్నాను" అని కృతి తెలిపింది.దీంతో పుకార్లకు చెక్ పడినట్లు అయింది.

## అఖిల్ అక్కినేనికి జోడీగా
# బాలీవుడ్ బ్యూటీ?




అఖిల్ అక్కినేని నెక్స్ట్ ఫిల్మ్ 'లెనిన్'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు మురళీ కిశోర్ అబ్బూరి దర్శకులు. కాగా అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్స్‌పై నాగార్జున, నాగ వంశీ నిర్మిస్తున్నారు.ఈ చిత్రం సమ్మర్ విడుదలకు సిద్ధం అవుతుండగా.. మాస్ మసాలా సాంగ్ డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్ యంగ్ బ్యూటీ అనన్యా పాండే ఈ స్పెషల్ సాంగ్ చేయనున్నట్లు స్ట్రాంగ్ బజ్ వినిపిస్తుంది. త్వరలోనే దీనిపై అఫిషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశముంది. ఇందుకు సంబంధించిన న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. అనన్యను హీరోయిన్‌గా ఎంచుకుని ఉంటే బాగుండేదనే కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. కాగా విజయ్ దేవరకొండ 'లైగర్'తో తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన అనన్య.. ఈ మూవీ డిజాస్టర్ కావడంతో.. తర్వాతి ప్రాజెక్ట్స్ ఆచి తూచి ఎంచుకుంటుంది.

# 'గోదారి గట్టుపైన' టీజర్..
## ఆహ్లాదకరంగా, ఆనందంగా సాగిపోయే కథ..

'మేమ్ ఫేమస్' సినిమాతో హీరోగా, దర్శకుడిగా హిట్ అందుకున్న సుమంత్ ప్రభాస్.. 'గోదారి గట్టుపై' మూవీతో మ్యాజిక్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు.

నిధి ప్రదీప్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా నుంచి తాజాగా టీజర్ రిలీజ్ కాగా పాజిటివ్ వైబ్స్‌తో దూసుకుపోనున్నట్లు తెలిసిపోతుంది. ఆస్కార్ గ్యాంగ్ అంటూ ఐదుగురు ఫ్రెండ్స్‌తో చేసే అల్లరి, క్యూట్ లవ్ స్టోరీ కలిసి సినిమా సక్సెస్‌కు ప్లస్ కానున్నట్లు అనిపిస్తోంది. మణిరత్నం, గౌతమ్ మీనన్ కూడా టచ్ చేయని కాంబినేషన్‌రా మనది, మాయ.. మ్యాజిక్.. లాంటి డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. ఓ అమ్మాయి.. అన్న, స్నేహితురాలు మధ్య జరిగే ప్రేమ ప్రయాణంలో మలుపులే ఈ 'గోదారి గట్టు'పై కాగా షార్ట్ ఫిల్మ్స్ ద్వారా క్రేజ్ సంపాదించిన సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు.

జగపతి బాబు, లైలా కీలకపాత్రల్లో కనిపించనున్న మూవీని ఆసియన్ సినిమాస్ సమర్పిస్తుండగా.. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్‌పై అభినవ్ రావ్ నిర్మిస్తున్నాడు.



# ఊపేస్తున్న 'వామ్మో.. వాయ్యో' పాట



మాస్ మహారాజా రవితేజ హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు.మొదటి రెండు పాటలు ఇప్పటికే అద్భుతమైన స్పందనను పొందాయి. తాజాగా వరంగల్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో మూడో ట్రాక్ 'వామ్మో వాయ్యో' లాంచ్ చేశారు మేకర్స్. భీమ్స్ సిసిరోలియో మరోసారి మాస్ ఆడియన్స్‌ను కట్టిపడేసే సాంగ్ కంపోజ్ చేశారు. 'వామ్మో వాయ్యో' ఫుల్ జోష్‌తో సాగే ఫోక్ ట్రాక్‌గా నిలుస్తూ, వినగానే ఎనర్జీని ఇస్తుంది. లైవ్లీ ఆర్కెస్ట్రేషన్ పాటకు ప్రాణం పోస్తే, స్వాతి రెడ్డి అందించిన వాయిస్ ఈ పాటను మరో స్థాయికి తీసుకెళ్లింది. దేవ్ పవార్ రాసిన లిరిక్స్ రస్టిక్ ఫ్లేవర్‌తో పాటు పక్కా మాస్ టచ్ ఉండగా.. శేఖర్ ఎవి మాస్టర్ కొరియోగ్రఫీ హై ఎనర్జీ స్టెప్స్‌తో కిక్ ఇచ్చింది. హీరో హీరోయిన్లు ఈ పాటకు తమ డ్యాన్స్‌తో అదరగొట్టేశారు.

# యోగ ప్రాణయానంతో శారీరక మానసిక రోగాలకు విముక్తి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫలక్ నామా బాయ్స్ హాస్టల్ 350 మంది పిల్లలకు ఉచిత యోగ క్లాస్ ను యోగా గురు ఆలే సత్తయ్య నిర్వహించారు. అజ్ఞానం నుండి విముక్తి, ఆవేశం నుండి విముక్తి, అశాంతి నుండి విముక్తి, టెన్షన్ నుండి విముక్తి, రోగాల నుండి విముక్తి, ఆవేశం నుండి విభక్తి, అన్ని రోగాల నుండి విముక్తి, ధ్యానం, ప్రాణాయామం, ఆసనాలు, ఆహారాన్ని సంపూర్ణ ఆరోగ్యానికి సాధన విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఇందులో హాస్టల్ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్త్రీ విద్యకు స్ఫూర్తి సావిత్రిబాయి పూలే

- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు : డాక్టర్ మధు మహేష్
- ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి
- మహిళా ఉపాధ్యాయులకు మై వేములవాడ ట్రస్ట్ సత్కారం

వేములవాడ (ప్రశ్న న్యూస్) దేశంలో మహిళా విద్యకు బాటలు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకుని, తెలంగాణ ప్రభుత్వం జనవరి 3ను మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిన సందర్భంగా మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ మాట్లాడుతూ స్త్రీ విద్యకు స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే అని,విద్యాబోధనతో పాటు విద్యార్థినీ విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపిస్తూ సమాజానికి దిశానిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల





ప్రధానోపాధ్యాయులు భూక్య బన్నాజీ, పాఠశాల సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, వొడ్యాల వేణు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, సగ్గు రాహుల్, పసుల శ్రీనివాస్, అన్నం నర్సయ్య

# అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- నీలోజిపల్లి సర్పంచ్ : అనుముల భాస్కర్
- పాలకవర్గం సభ్యులతో కలిసి మానసదేవి ఆలయం సందర్శనా ప్రత్యేక పూజలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులతో కలిసి శనివారం కరీంనగర్ జిల్లా, బెజ్జంకి మండలంలోని ఖాసీంపేట గ్రామంలో స్వయంభూగా వెలసిన మానస దేవి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనం అనంతరం సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ,అమ్మవారి దివ్యాశీస్సులతో గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి పనులు నిరంతరంగా సాగేందుకు, ప్రజల సహకారంతో పాలన కొనసాగిస్తామని అన్నారు. భవిష్యత్తులో నీలోజిపల్లిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# జిల్లా పరిషత్ హై స్కూల్ గుంజపడుగులో ఘనంగా సావిత్రి భాయ్ పూలే జయంతి



మంథని ( ప్రశ్న న్యూస్) మొదటి భారత దేశ మహిళ ఉపాధ్యాయురాలు,సంఘ సంస్కర్త సావిత్రి భాయ్ పూలే జయంతి ని జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవం గా జిల్లా పరిషత్ హై స్కూల్ గుంజపడుగులో ఘనంగా నిర్వహించారు.సావిత్రి భాయి పూలే తన భర్త జ్యోతి భాయ్ పూలే కలిసి ఆనాటి కాలం లోన్ బాలిక విద్య ఆవశ్యకతను సమాజానికి చాటి బాలికల పాఠశాలను స్థాపించి చేసిన సేవలను కొనియాడారు,విద్య ద్వారానే మహిళలు సాధికారత సాధిస్తారని బాలిక విద్యను ప్రోత్సహించడమే కాకుండా అనేక అసమానతలను వీరు చేసిన పోరాటం అద్భుతం అని పేర్కొన్నారు.అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు శివలీల,సంగీత,విజయలక్ష్మి లను శాలువాలతో సన్మానించారు.ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శివలీల గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్,రవి,సంగీత,భూమయ్య,వి స్వామి,రవీందర్,కె స్వామి,సతీష్ రెడ్డి,విజయలక్ష్మి,సమ్మయ్య లు పాల్గొన్నారు

# టీజెఎస్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంపాటి సాయిచందర్ గౌడ్ నియామకం



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంపాటి సాయిచందర్ గౌడ్ ని రాష్ట్ర అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం సిద్ధాంతాలు, ఆదర్శాలకు అంకితమై నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంఘం తరఫున ముందుండి పనిచేయాలని ఆకాంక్షించారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఖమ్మంపాటి సాయిచందర్ గౌడ్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి రాష్ట్ర అధ్యక్షుడికి, ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణకి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, సభ్యుల ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి జర్నలిస్టులకు అండగా నిలబడతానని ఆయన పేర్కొన్నారు. ఈ నియామక కార్యక్రమంలో సంఘానికి చెందిన పలువురు నాయకులు, సభ్యులు పాల్గొని ఖమ్మంపాటి సాయిచందర్ గౌడ్ ని అభినందించారు.

# సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు.

**బాలికల కాలేజీ విద్యార్థినులకు బహుమతులు ప్రధానం.**

**కాంగ్రెస్ పార్టీ మాజీ జెడ్పిటిసి మూల సరోజన రెడ్డి.**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని పట్టణంలోని సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంథని పట్టణంలోని గర్ల్స్ కళాశాల మహిళా లెక్చరర్లు అయిన కే ఝాన్సీ, ఎం శ్రీదేవి, సబిత, మౌనిక గార్లను శాలువతో సన్మానించారు.అనంతరం సామాజిక సేవలో సావిత్రిబాయి పూలే అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రథమ బహుమతి బి శ్రీ లాలిత్య హెచ్ ఇ సి ఫస్ట్ ఇఇయర్, , ద్వితీయ బహుమతి శ్రీనిధి ఎంపీసీ సెకండ్ ఇయర్ ,తృతీయ బహుమతి కె అభినయ హెచ్ఈసి సెకండియర్ విద్యార్థినులకు శాలువాతో సన్మానించి మెమొంటోలు ప్రధానం చేశారు .మూల సరోజన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశం మొట్టమొదటి ఉపాధ్యాయురాలు అని సంఘసంస్కర్త కవయిత్రి మహిళలకు చదువు నేర్పిన చదువుల తల్లి అని పేర్కొన్నారు అనేక పాఠశాలలు నెలకొల్పి మహిళలకు విద్యను అందించారని వితంతు వివాహాలను ప్రోత్సహించారని బాల్య వివాహాలను రూపుమాపారని అనాథ ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవ చేసిన గొప్ప మానవతావాది అని తెలిపారు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ఆమె ఆశయాలను కొనసాగించాలని ఆమె బాటలో నడవాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో స్టూడెంట్ జేఏసీ నాయకుడు బెజ్జంకి. డి గంబర్ కళాశాల లెక్చరర్స్ బి శ్రీధర్ రావు ,ఆర్ తిరుమల్ ,ఎల్ఆర్కే రాజేశ్వరరెడ్డి, సిహెచ్ నగేష్ లతోపాటు అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# భాస్కర్ విజయం నీలోజిపల్లి గ్రామ ఉత్తమ భవిష్యత్తుకు సంకేతం

- మాజీ ఎంపీ : బోయినపల్లి వినోద్ కుమార్ కితాబు
- అనుముల భాస్కర్ కు బోయినపల్లి ఘన సన్మానరా శుభాకాంక్షలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సర్పంచ్ అనుముల భాస్కర్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ అగ్రనేత,మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ ను హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు.ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ సర్పంచ్ అనుముల భాస్కర్ ‌కు పుష్ప గుచ్ఛం అందజేసి,శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, “స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం గొప్ప బాధ్యత. నీలోజిపల్లి గ్రామ అభివృద్ధి కోసం పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాలి. గ్రామంలోని మౌళిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో నిబద్ధతతో పని చేస్తే మరింత విశ్వాసం పెరుగుతుంది. మీ విజయం గ్రామానికి మంచి భవిష్యత్తుకు సంకేతం” అని కితాబిచ్చారు. అనంతరంసర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, “పెద్దల ఆశీస్సులు, ప్రజల మద్దతుతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తాను” అని తెలిపారు.

# గ్రామాభివృద్ధి నిర్వాసితుల సమస్యలపై సీపీఐ రాష్ట్ర నేత చాడతో అనుముల భాస్కర్ చర్చ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ శనివారం కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గ్రామీణ సమస్యలు, అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చ జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, నీలోజిపల్లి గ్రామం మిడ్ మానేరు ముంపుతో తీవ్రంగా నష్టపోయిందని, నిర్వాసితుల సమస్యలు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారమవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులకు న్యాయమైన పరిహారం, పునరావాస సదుపాయాలు కల్పించే దిశగా రాష్ట్ర స్థాయిలో గళం విప్పాలని కోరారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అందరూ కలిసి నిర్వాసితుల హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే చాడవెంకట రెడ్డి మాట్లాడుతూ, నీలోజిపల్లి నిర్వాసితుల సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని తెలిపారు. ప్రజా సమస్యలపై సిపిఐ ఎప్పటికీ పోరాట పంథాలోనే ఉంటుందని, నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ తరఫున మద్దతు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు.ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగగా, భవిష్యత్తులో గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలపై సమన్వయంతో ముందుకు సాగాలని ఇద్దరూ అభిప్రాయపడ్డారు.

# విద్యనే ఆయుధంగా చేసుకొని మహిళా సమానత్వం కోసం సావిత్రిబాయి చేసిన కృషి నేటికీ ఆదర్శం

- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు : ల్యాగల దేవయ్య



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ బోయినిపల్లి మండలాధ్యక్షులు ల్యాగల దేవయ్య శనివారం ఆ మహనీయురాలికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన త్యాగం అపూర్వమని, విద్యనే ఆయుధంగా చేసుకొని సమానత్వం కోసం ఆమె సాగించిన పోరాటం నేటికీ అందరికీ మార్గదర్శకమని అన్నారు. సమాజంలో అక్షరజ్ఞానం ద్వారా చైతన్యం కలిగించాలనే ఆమె ఆశయాలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిస్తూ జ్ఞాన దీపాలను వెలిగిస్తూ విలువల బాటలో విద్యార్థులను నడిపిస్తున్న ప్రతి మహిళా ఉపాధ్యాయురాలికి ‘మహిళా ఉపాధ్యాయ దినోత్సవం’ శుభాకాంక్షలు తెలియజేశారు.

# రసాయన శాస్త్రంలో శ్రీధర్ రెడ్డికి పీహెచ్.డీ



పటాన్‌చేరు(ప్రశ్న న్యూస్) హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి శ్రీధర్ రెడ్డి తుమ్మల డాక్టరేట్ కు అర్హత సాధించారు. ‘శక్తివంతమైన క్యాన్సర్ నిరోధక కారకాలుగా పనిచేసే ట్రయాజోల్స్, టెట్రాజోల్స్, పైరజోల్స్ తో సహా అజోల్ హైబ్రిడ్ ల కోసం ఒక కొత్త సంశ్లేషణ పద్ధతి’పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కొప్పుల శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ శ్రీధర్ రెడ్డి పరిశోధన నూతన అజోల్ ఆధారిత హైబ్రిడ్ అణువుల సంశ్లేషణ, సంభావ్య క్యాన్సర్ నిరోధక ఏజెంట్లుగా వాటి మూల్యాంకనంపై దృష్టి పెట్టినట్టు వెల్లడించారు. బహుళ మానవ క్యాన్సర్ కణ తంతువులలో ప్రామాణిక రిఫరెన్స్ ఔషధాలతో పోలిస్తే అనేక సంశ్లేషణ సమ్మేళనాలు అత్యుత్తమ ఇన్ విట్రో యాంటీ క్యాన్సర్ కార్యాచరణను ప్రదర్శించినట్టు తెలిపారు. మాలిక్యులర్ డాకింగ్, ఇన్ సిలికో అడ్మెట్ అధ్యయనాలు వాటి బలమైన బైండింగ్ అనుబంధం, ఔషధ పోలిక, చికిత్సా సామర్థ్యాన్ని మరింత నిర్ధారించినట్టు వివరించారు.డాక్టర్ శ్రీధర్ రెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజా సేవే లక్ష్యంగా అధికారుల సమన్వయం

- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య
- మండల ఉన్నతాధికారులకు విలాసాగర్ సర్పంచ్ కనుకయ్య ఘన సన్మానరా శుభాకాంక్షలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ సెస్ డైరెక్టర్ ఏనుగుల కనుకయ్య శనివారం బోయినిపల్లి మండల ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కాలే నారాయణ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి భీమా జయశీలలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. నూతన ఆంగ్ల సంవత్సరం-2026ను పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండల అభివృద్ధి లక్ష్యంగా అధికారుల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.



# మున్సిపల్ పోరుకు రంగం సిద్ధం

## - వారం పదిరోజుల్లో షెడ్యూల్, ఫిబ్రవరిలో పోలింగ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక అంకానికి తెర లేవనుంది. రాష్ట్రంలో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అభివృద్ధి పాలనను సమాంతరంగా పరుగులు తీయించడమే లక్ష్యంగా ఫిబ్రవరి నెలలో ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### - ఎన్నికల షెడ్యూల్‌విడుదల ముహూర్తం ఖరారు

ప్రస్తుతానికి ప్రభుత్వం నుంచి అందుతున్న సమాచారం ప్రకారం జనవరి రెండో వారంలో నోటిఫికేషన్ రిలీజ్ చేయనున్నారు. దీనికి రెండు తేదీలను కూడా ఖరారు చేశారు. సంక్రాంతి ముందు లేదా సంక్రాంతి తర్వాత షెడ్యూల్ రిలీజ్ చేస్తారు. ఎన్నికలను అక్కడికి నెల రోజుల్లో నిర్వహిస్తారు. అంటే ఫిబ్రవరిలో రెండు మూడు వారాల్లో చేపట్టేలా ప్రభుత్వం రోడ్ మ్యాప్ నిర్ణయించింది. ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించిన ఎన్నికల సంఘం, అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన చేపడుతోంది.

ఓటర్ల జాబితా సిద్ధంగా ఉండటంతో ఎన్నికల నిర్వహణకు సాంకేతిక అడ్డంకులు ఉండవని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

### - రాజకీయం కంటే నిధులు ముఖ్యం

ఎన్నికల నిర్వహణ కేవలం రాజకీయ అవసరం మాత్రమే కాకుండా 15వ ఆర్థిక సంఘం నిబంధనల ప్రకారం ప్రజాప్రతినిధుల పాలన ఉంటేనే కేంద్రం నుంచి నిధులు వస్తాయి. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నందున కేంద్రం గ్రాంట్లు విడుదల నిలిచిపోయింది. ఈ నిధులు వస్తే మున్సిపాలిటీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు సర్పంచ్ ఎన్నికల్లో భారీగా స్థానాలు తమ పార్టీకి చెందిన వారిని గెలిపించుకున్న కాంగ్రెస్ మంచి జోష్ మీద ఉంది. ఇది కంటిన్యూ చేయడానికి కూడా ఈ ఎన్నికలు సహాయపడతాయని భావిస్తోంది.

### - జీహెచ్‌ఎంసీ గడువు ఫిబ్రవరితో పూర్తి

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి గడువు కూడా ఫిబ్రవరితో పూర్తి కానుంది. ఈ ఎన్నికల నిర్వహించే ముందు జీహెచ్‌ఎంసీని మూడు ప్రత్యేక కార్పొరేషన్లుగా విభజించాలని ఆలోచిస్తోంది.

ఈ విభజన ద్వారా నగర పాలనను మరింత వికేంద్రీకరించి, ప్రజలకు చేరువ చేయాలని చూస్తోంది. ప్రస్తుతం ఉన్న 300 వార్డులను కూడా మూడు కార్పొరేషన్లకు తగ్గట్టుగా విభజిస్తారు. అనంతరం కొత్త ఓటర్ల జాబితాను రూపొందిస్తారు.




### - విదేశాల నుంచి వచ్చిన తర్వాత మరింత దూకుడు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 19 నుంచి 23 వరకు స్విట్జర్లాండ్‌లో పర్యటిస్తారు. దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాలకు హాజరవుతారు.

అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఇకపై కంటిన్యూగా ప్రజల్లోనే ఉండాలని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. ఫిబ్రవరి 3న జడ్చర్లలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి ఏదో గ్రామంలో కార్యక్రమం పెట్టుకోవాలని ప్లాన్ చేస్తున్నారు.

ఇప్పటి వరకు పర్యటించని ప్రాంతాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అదే టైంలో ఎన్నికల్లో భారీ విజయం సాధించేలా శ్రేణులను ఉత్సాహ పరచనున్నారు. ఓవైపు కేడర్‌లో జోష్ నింపుతూ అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువ చేస్తున్నామనే సంకేతాలు ఇస్తారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం

- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సమయంలో లాబీల్లో తిరిగిన ఎమ్మెల్యేలు
- కీలక అంశంపై ప్రజెంటేషన్ ఇస్తుంటే ఇలా వ్యవహరించడం సరైనది కాదన్న సీఎం
- అధికార పార్టీ ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభలో ఉండాలన్న ముఖ్యమంత్రి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ్యుల పట్ల సీరియస్ అయ్యారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న సమయంలో కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో 'నీళ్లు –నిజాలు'పై స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమయంలో కొందరు ఎమ్మెల్యేలు సభలో ఉండకుండా లాబీల్లో తిరిగారు. ప్రభుత్వం ఒక కీలక అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తుంటే ఎమ్మెల్యేలు సభలో లేకపోవడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలా వ్యవహరిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటుందని అన్నారు. ప్రజలు సమావేశాలను గమనిస్తుంటారని, కాబట్టి ఎమ్మెల్యేలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఎమ్మెల్యేలు సభలో లేకపోవడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని ఆయన అన్నారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై చర్చ జరుగుతున్నప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభలో ఉండాలని సూచించారు. ఎమ్మెల్యేలందరినీ సభలోకి పిలిపించాలని కాంగ్రెస్ విప్‌లను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు.

# తెలంగాణ ప్రజలను ఏకం చేసిన జయజయ హే గీతం

- అందెశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండ
- అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జయ జయహే తెలంగాణ గీతం ద్వారా రాష్ట్ర ప్రజలను ఏకం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన అందెశ్రీ సేవలను ప్రభుత్వం గుర్తించింది, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. అందెశ్రీగా పిలవబడే అందె ఎల్లయ్య తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా రేపర్తి గ్రామంలో అనాథ అయిన అందెశ్రీ పశువుల కాపరిగా ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొని గీత రచయితగా ఎదిగారు అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎటువంటి సాధికారత విద్య లేకున్నా తెలంగాణ గ్రామీణ మరియు అనగారిన వర్గాలను ప్రతిబింబించేలా ఆయన 3 వేల కవితలు రచించారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆశలు, పోరాటాలు వాటి స్ఫూర్తిని తెలియజేస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచించిన జయ జయ హే తెలంగాణ గీతం రాష్ట్ర ప్రజలను ఏకం చేయడంలో ప్రముఖ పాత్ర వహించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

### - రాష్ట్ర గీతంగా జయజయ హే తెలంగాణ

అందెశ్రీ వారసత్వం తెలంగాణ అంతట కొనసాగుతుంది అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అందెశ్రీ విప్లవాత్మక కవితలు భావోద్వేగంతో కూడిన గేయాలు కార్మికులు, రైతులు, అణగారిన వర్గాలను ప్రభావితం చేయడమే కాకుండా వారి పోరాటాలను వ్యక్తీకరించాయి తెలంగాణ సంస్కృతికి స్వరంగా నిలిచాయి అని కొనియాడారు. అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా చేయాలని 2- జూన్- 24 న 783 జీవో ద్వారా ఆమోదించిందని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి వారు అందించిన అమూల్యమైన సేవలను దృష్టిలో పెట్టుకొని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. వారి అకాల మరణంతో నష్టపోయిన వారి కుటుంబం సామాజికంగా, ఆర్థికంగా ఎదుర్కొనే సవాళ్లపై సకాలంలో మానవీయ దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజిక న్యాయ సూత్రాలు, పరిపాలన సంబంధమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉందని వివరించారు. ఈ చర్య తెలంగాణ ఐక్యత, పురోగతికి తన జీవితాన్ని అంకితం చేసి సాంస్కృతికి ప్రతీకగా నిలిచిన అందెశ్రీని గుర్తించి గౌరవించి ప్రభుత్వం కుటుంబానికి హామీ ఇస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

### - అధికారిక గేయంగా జయజయహే తెలంగాణ

'తెలంగాణ సమాజం అంటేనే కవులు కళాకారులు, వారి దగ్గర ఉన్న కలలు అన్నీ పీడిత ప్రజల విముక్తి కోసం సమ సమాజ నిర్మాణం కోసం, వారి ఆశయాలు ఆశలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తుంది అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో చాలామంది కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గౌరవించుకుంటూ వచ్చిందని తెలిపారు. అందెశ్రీ గేయం జయ జయహే తెలంగాణ ఈ సమాజాన్ని ఏ విధంగా మేలుకొలిపిందో అందరికీ తెలుసు తెలంగాణ ఉద్యమ సమయంలో జయ జయ గీతాన్ని పెద్ద ఎత్తున వాడుకొని రాష్ట్రం వచ్చినాక ఆనాటి పాలకులు ఆ గేయాన్ని, మనిషిని వదిలేసిన గత ప్రభుత్వాన్ని చూసాం అన్నారు. మా ప్రభుత్వం ఏర్పడగానే ఆ గేయాన్ని అధికారిక గేయంగా ప్రకటించడమే కాకుండా వారిని ఏ రకంగా గౌరవించుకున్నామో రాష్ట్ర ప్రజలందరూ చూశారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. దురదృష్టవశాత్తు అందే శ్రీ అకాల మరణం చెంది మన మధ్య లేకపోవడాన్ని చింతిస్తూనే వారి గౌరవాన్ని పెంపొందిస్తూ మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు అని వారు రాసి, పాడిన పాట స్ఫూర్తితో ఈ ప్రభుత్వం పనిచేస్తుంది డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.



### - అందెశ్రీ కొడుకుకి ఉద్యోగం ఇచ్చాం

'మానవత్వంతో ఈ ప్రభుత్వం అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం బాధ్యతగా భావించి వారి కుమారుడు దత్త సాయి కి ఉన్నత విద్యా శాఖలో డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమించాం'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. 25 నవంబర్ 2025న ఆర్డినెన్స్ 7 ద్వారా ఉద్యోగ నియామకం చేశామని ఆ ఆర్డినెన్స్ ఈరోజు అందరి చేత ఏకగ్రీవంగా ఆమోదించుకోవడం హర్షనీయం అని అన్నారు. అందెశ్రీ తో పాటు పొడుస్తున్న పొద్దు మీద పాటతో తెలంగాణ సమాజాన్ని ఉవ్వెత్తున లేపి తెలంగాణ రాష్ట్ర సాధనకు ఏ విధంగా గద్దర్ అన్న ఉపయోగపడ్డారూ అందరికీ తెలిసిన విషయమే అన్నారు. గద్దర్ అన్న తన జీవితాంతం ఆడి పాడి ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేశారు రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత నాటి సీఎంను కలవడానికి గంటల తరబడి ఎండలో నిలబడితే గద్దర్ అన్నకు గత ప్రభుత్వం అవకాశం కల్పించలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక వారిని ఏ విధంగా గౌరవించుకుందో తెలంగాణ సమాజానికి తెలియంది కాదు అన్నారు.

గతంలో సినిమా ఇండస్ట్రీ లో ఇస్తున్న నంది అవార్డు స్థానంలో గద్దర్ అవార్డ్స్ గా నామకరణం చేశాం, ఉద్యమ సమయంలో సేవలు అందించిన పాశం యాదగిరి, జయరాజు, గూడ అంజన్న, గోరటి వెంకన్న లాంటి వారిని సాంస్కృతిక శాఖ ద్వారా గుర్తించాం, వారి ఆటపాటల ద్వారా తెలంగాణ ప్రజల కోరికలను తెలియజేశారు అని తెలిపారు. కవులు, కళాకారులను ఈ రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు.

# రూ.35 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- కూకట్‌పల్లిలో కబ్జాదారుల నుంచి 3 వేల గజాల భూమిని కాపాడిన హైడ్రా
- స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు
- రెండు పార్కుల చుట్టూ ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పరిధిలో కబ్జాకు గురైన సుమారు రూ. 35 కోట్ల విలువైన పార్కు స్థలాలను హైడ్రా అధికారులు కాపాడారు. మొత్తం 3 వేల గజాల విస్తీర్ణంలో ఉన్న రెండు పార్కుల స్థలాలను శనివారం స్వాధీనం చేసుకుని, వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి భాగ్యనగర్ ఫేజ్–3 కాలనీలోని పార్కులు ఆక్రమణకు గురయ్యాయని అక్కడి సంక్షేమ సంఘం సభ్యులు 'ప్రజావాణి'లో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఆక్రమణలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు. సర్వే నంబర్లు 197, 200 పరిధిలో 1987లో హుడా అనుమతితో భాగ్యనగర్ ఫేజ్–3 లేఅవుట్ ఏర్పడింది. ఇందులో రెండు స్థలాలను పార్కుల కోసం కేటాయించారు. అయితే, 2 వేల గజాల పార్కులో సగం స్థలం, ఎకరం విస్తీర్ణంలోని మరో పార్కులో వెయ్యి గజాల స్థలం కబ్జాకు గురైనట్లు అధికారులు తమ నివేదికలో గుర్తించారు. ఈ నివేదిక ఆధారంగా కమిషనర్ ఆదేశాలతో శనివారం ఆక్రమణలను తొలగించారు. ఖాళీ చేయించిన స్థలంలో 'హైడ్రా' బోర్డులను ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించారు. తమ కాలనీలోని విలువైన పార్కు స్థలాలను కాపాడినందుకు స్థానికులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ 12 మంది మావోయిస్టులు మృతి

**ఛత్తీస్‌గఢ్** (ప్రశ్న న్యూస్) మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు



మరణించారు. కిష్టారం అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతిచెందిన వారిలో కుంట ఏరియా కార్యదర్శి మంగడు మృతిచెందినట్లు తెలిసింది. ఘటనాస్థలిలో ఏకే 47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు.


# బందీగా వెనిజులా అధ్యక్షుడు మదురో

## - తొలి ఫొటో విడుదల చేసిన ట్రంప్

న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ సైన్యం చేతచిక్కిన వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధించిన ఒక ఫొటోను తన 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో విడుదల చేశారు. కళ్లకు గంతలు కట్టి, చేతులు కట్టేసి ఉన్న మదురో యూఎస్ నేవీకి చెందిన యుద్ధనౌక యూఎస్‌ఎస్ ఐవో జిమాపై ఉన్నట్లు ఆ ఫొటోలో కనిపిస్తోంది. "నికోలస్ మదురో యూఎస్‌పేస్ ఐవో జిమా నౌక పై ఉన్నాడు" అని ట్రంప్ ఆ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చారు. వెనిజులా రాజధాని కారకాస్‌లో అమెరికా సైన్యం భారీ సైనిక ఆపరేషన్ నిర్వహించి మదురోను, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో యూఎస్ ఆర్మీకి చెందిన 'డెల్టా ఫోర్స్' కీలక పాత్ర పోషించింది. ఈ ఆపరేషన్ వివరాలను ఫాక్స్ & ఫ్రెండ్స్ కార్యక్రమంలో ట్రంప్ పంచుకున్నారు. కొంతమంది అమెరికా సైనికులు గాయపడ్డారని, అయితే ప్రాణనష్టం జరగలేదని ఆయన తెలిపారు. నార్కో–టెర్రరిజం, డ్రగ్ ట్రాఫికింగ్ ఆరోపణల కింద మదురో దంపతులు న్యూయార్క్‌లో విచారణ ఎదుర్కోనున్నట్లు తెలుస్తోంది.

ఈ ఆపరేషన్ సమయంలో కారకాస్‌లో భారీ పేలుళ్లు, తక్కువ ఎత్తులో విమానాల సంచారంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

ఇది అమెరికా దురాక్రమణేనని వెనిజులా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ అనూహ్య పరిణామంపై అంతర్జాతీయంగా మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588